www.udyamakeratam.com

PRGI No. : TGTEL/25/A0273

ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత: UDYAMA KERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 151 | 26-11-2026 | గురువారం | పేజీలు: 8 | వెల : రూ.2/-

ట్రంప్ టారిఫ్ బాంబ్



- భారత్‌పై 25, చైనాకు 40 శాతం
- వియత్నాంపై 35 శాతం విధించే అవకాశం
- పలు వాణిజ్య భాగస్వామ్య దేశాలపైనా అదనపు భారం

4

రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో

భారీ ఊరట!




- ఆస్తుల ఆరోపణలపై అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు రద్దు
- సీబీఐ, ఈడీలకు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసిన ధర్మాసనం

4

ఐదు కీలక ప్రాజెక్టులకు

కేంద్రం ఆమోదం



- కామరాజర్ పోర్టులో రెండో కంటైనర్ టెర్మినల్
- దోలూలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం
- పరికరాల తయారీకి రూ.11 వేల కోట్ల పథకం
- తపాలా శాఖకు రూ.2,632 కోట్ల కేటాయింపులు

4

పదవులు మూడు తలనొప్పులు ముప్పై!

హస్తంలో పదవుల పంచాయితీ!



- గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవుల కోసం కాంగ్రెస్‌లో తీవ్ర పోటీ
- సామాజిక సమీకరణాలపై అధిష్ఠానం కసరత్తు
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే డిమాండ్
- ఇప్పుడే భర్తీ చేయాలా?.. మార్చి వరకు వేచి చూడాలా?
- నిరాశకు గురయ్యే నేతలకు కార్పొరేషన్ పదవులపై భరోసా ఇచ్చే యోచన
- ఆశావహులను సముదాయించడం బీఎం సందీప్‌కు సవాల్

తెలంగాణ అధికార కాంగ్రెస్‌లో మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీ వ్యవహారం ఆసక్తికరంగా మారింది. పదవులు మూడే అయినా వాటిని దక్కించుకునేందుకు సుమారు 30 మంది నాయకులు పోటీపడుతుండటంతో పార్టీలో అంతర్గత రాజకీయాలు వేడెక్కాయి. గతంలో ఈ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమితులైన బస్వరాజు సారయ్య, గోరటి వెంకన్న, బొగ్గారపు దయానంద్‌ల పదవీకాలం నవంబర్ 14తో ముగిసింది. దీంతో ఖాళీ అయిన స్థానాలపై సీనియర్ నేతలు, ప్రభుత్వ సలహాదారులు, ఉద్యమకారులు ఆశలు పెట్టుకున్నారు. ఈ పరిణామాల మధ్య మూడు నామినేటెడ్ పదవుల భర్తీ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల నూతన ఇన్‌ఛార్జి బీఎం సందీప్‌కు కీలక పరీక్షగా మారింది.

హైదరాబాద్, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): తెలంగాణ అధికార కాంగ్రెస్‌లో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీ వ్యవహారం ఆసక్తికరంగా మారింది. ఖాళీగా ఉన్నవి 3 పదవులే అయినా వాటిని దక్కించుకునేందుకు దాదాపు 30 మంది నాయకులు ప్రయత్నాలు చేస్తుండటంతో పార్టీలో అంతర్గత రాజకీయాలు వేడెక్కాయి. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమితులైన బస్వరాజు సారయ్య, గోరటి వెంకన్న, బొగ్గారపు దయానంద్‌ల పదవీకాలం నవంబర్ 14తో ముగిసింది. దీంతో సీనియర్ నాయకులు, ప్రభుత్వ సలహాదారులు, ఉద్యమకారులు ఈ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే పలువురు నేతలు పార్టీ పెద్దలను కలిసి మిగతా 2 లో



పౌల్ట్రీ పరిశ్రమకు సర్కారు చేయూత!

- త్వరలో సమగ్ర విధానం.. సింగిల్ విండో ద్వారా అనుమతులు
- భారత్ ఫ్యూచర్ సిటీలో కన్వెన్షన్ సెంటర్‌కు భూమి
- సంక్షోభ సమయాల్లో దాణా సరఫరాకు సహకారం
- మొక్కజొన్న, సోయాబీన్ సరఫరాపై 48 గంటల్లో నిర్ణయం
- పెట్టుబడులకు పూర్తి రక్షణ కల్పిస్తాం
- 18వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

2

ఖేలో ఇండియా పోటీలకు

పకడ్బందీ ఏర్పాట్లు



- డిసెంబర్ 11 నుంచి 22 వరకు క్రీడా సంబరాలు
- ఎల్బీ స్టేడియంలో ప్రారంభం.. గచ్చిబౌలిలో ముగింపు
- జిల్లాల వారీగా మంత్రులకు పర్యవేక్షణ బాధ్యతలు
- నాణ్యతలో రాజీ వద్దన్న సీఎం రేవంత్ రెడ్డి



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల

కొత్త ఓటర్ల లిస్ట్ రిలీజ్

రెండు పట్టభద్రుల స్థానాల్లో 11.89 లక్షల ఓటర్లకు ఆమోదం

డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, కొత్త దరఖాస్తులు

వివరాలు 3వ పేజీలో



డ్రగ్స్‌కు నో చెప్పండి.. జీవితానికి ఎస్ చెప్పండి

మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కదలాలి

2029 నాటికి డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యం

ప్రముఖ సినీ నటుడు విక్టరీ వెంకటేష్

హాస్టల్‌లో విద్యార్థిని ప్రసవం

పసికందు మృతి!

2

మహబూబాబాద్ గిరిజన కళాశాలలో కలకలం

ప్రభుత్వ దవాఖానలో విద్యార్థినికి చికిత్స

పర్యవేక్షణ లోపంపై విద్యార్థి సంఘాల ఆగ్రహం





ఇంటర్ బోర్డు విలీనాన్ని ఒప్పుకోం!

- విద్యావేత్తలు, తల్లిదండ్రులతో చర్చించాకే నిర్ణయం తీసుకోవాలి
- విద్యార్థులపై అదనపు ఫీజుల భారం పడే ప్రమాదం
- రైతులను ఎలా ఆదుకుంటారో ప్రభుత్వం స్పష్టం చేయాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత

3

ఏసీబీ అధికారులపైనే లంచం ఆరోపణలు

- డీఏ కేసు నుంచి తప్పించేందుకు రూ.30 లక్షలు డిమాండ్
- విచారణాధికారి సుధీర్ కుమార్‌పై ఫిర్యాదు
- ఆడియో, వీడియో ఆధారాలు ఉన్నాయన్న మాజీ ఏడీఈ
- ఆరోపణలు రుజువైతే కఠిన చర్యలంటున్న ఏసీబీ

2



ఏసీబీ అధికారులపైనే లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిందితుడిగా ఉన్న టీజీఎస్‌పీడీసీఎల్ మాజీ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ అంబేద్కర్ కేసును మూసివేసేందుకు, మరో వ్యక్తి పేరును తొలగించేందుకు ఏసీబీ విచారణాధికారి రూ.30 లక్షలు అడిగారని ఏసీబీ డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఏసీబీ ఉన్నతాధికారులు, ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరుపుతామని, తప్పు చేసినవారు తమ శాఖకు చెందినవారైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.



తెలంగాణ ప్రీయోజనాలు ఏపీకి తాకట్టు

- పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుపై కేఆర్ఎంబీ సమావేశంలో ఎందుకు ప్రశ్నించలేదు?

3

- మేధావులు, తెలంగాణవాదులు ఆలోచించాలి
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు

ఉద్యమ కెరటం
నిజం రక్షణ కోసం | UDYAMAKERATAM TELUGU DAILY | తెలుగు దినపత్రిక



ఏసీబీ అధికారులపైనే లంచం ఆరోపణలు

డీఫ కేసు నుంచి తప్పించేందుకు రూ.30 లక్షలు డిమాండ్

విచారణాధికారి సుధీర్ కుమార్‌పై ఫిర్యాదు

ఆడియో, వీడియో ఆధారాలు ఉన్నాయన్న మాజీ ఏడీఈ

ఆరోపణలు రుజువైతే కఠిన చర్యలంటున్న ఏసీబీ

హైదరాబాద్, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): అవినీతిని అరికట్టాల్సిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులపైనే లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిందితుడిగా ఉన్న దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) మాజీ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్(ఏడీఈ) అంబేద్కర్.. తన కేసును మూసివేసేందుకు, మరో వ్యక్తి పేరును తొలగించేందుకు ఏసీబీ విచారణాధికారి రూ.30 లక్షలు అడిగారని ఆరోపించారు. ఈ మేరకు ఏసీబీ డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఏసీబీ ఉన్నతాధికారులు, ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరుపుతామని, తప్పు చేసినవారు తమ శాఖకు చెందినవారైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఇబ్రహీంబాగ్‌లో ఏడీఈగా పనిచేసిన సమయంలో తనపై 2025 సెప్టెంబర్ 15న ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశారని అంబేద్కర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసు క్రైమ్ నంబర్ 14/RCA-ACB-RRR/2025గా నమోదైందని తెలిపారు. వ్యవసాయం, అద్దెలు, పెట్టుబడులు, భార్య వేతనం తదితర చట్టబద్ధమైన ఆదాయ మార్గాలకు సంబంధించిన ఆదాయపు పన్ను రిటర్నులు, ఫారం–16 పత్రాలను అధికారులకు అందించినప్పటికీ వాటిని ఉద్దేశపూర్వకంగా పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. తనకు బినామీగా పేర్కొంటున్న ప్రభుత్వ ఉద్యోగి రాజేష్ పేరును కేసు నుంచి తొలగించేందుకు రూ.15 లక్షలు, తనపై నమోదైన డీఏ కేసును మూసివేసేందుకు మరో రూ.15 లక్షలు ఇవ్వాలని విచారణాధికారి సుధీర్ కుమార్ అడిగినట్లు అంబేద్కర్ ఫిర్యాదులో వివరించారు. మొత్తం రూ.30 లక్షలు డిమాండ్ చేయగా, అందులో రూ.5 లక్షలు ముందుగానే తీసుకున్నారని, మిగిలిన మొత్తాన్ని చెల్లించాలంటూ ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. విచారణాధికారి వ్యవహారశైలిపై ఏసీబీ డీఎస్పీ ఏపీ ఆనంద్ కుమార్‌కు ఫిర్యాదు చేసినా స్పందన రాలేదని అంబేద్కర్ పేర్కొన్నారు. సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోకుండా, సమస్యను సౌహార్దపూర్వకంగా పరిష్కరించుకోవాలని డీఎస్పీ సూచించినట్లు ఆరోపించారు. లంచం డిమాండ్‌కు సంబంధించిన సంభాషణలను ఆడియో, వీడియో రూపంలో రికార్డు చేశానని, వాటిని దర్యాప్తు సంస్థకు అందజేస్తానని తన ఫిర్యాదులో వెల్లడించారు. ఈ ఆరోపణలపై తెలంగాణ ఏసీబీ మంగళవారం ప్రకటన విడుదల చేసింది. శాఖలో అంతర్గత అవినీతిని ఏమాత్రం సహించబోమని, అవినీతి విషయంలో జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తున్నామని స్పష్టం చేసింది. చట్టానికి ఎవరూ అతీతులు కారని పేర్కొంది. మాజీ ఏడీఈ చేసిన ఫిర్యాదుపై ఇప్పటికే శాఖాపరమైన విచారణ ప్రారంభించినట్లు తెలిపింది. విచారణలో పాల్గొనాలని కోరుతూ ఫిర్యాదుదారుడికి మూడుసార్లు నోటీసులు పంపినప్పటికీ, ఆయన ఒక్కసారి కూడా హాజరుకాలేదని వెల్లడించింది. విచారణ పూర్తయ్యాక ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత అధికారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీబీ ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. తమ శాఖ అధికారుల అవినీతికి సంబంధించి ఎవరి వద్దైనా సమాచారం ఉంటే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని ప్రకటించారు.

హాస్టల్‌లో విద్యార్థిని ప్రసవం పసికందు మృతి!

మహబూబాబాద్ గిరిజన సంక్షేమ కళాశాలలో కలకలం

పర్యవేక్షణ లోపంపై విద్యార్థి సంఘాల ఆగ్రహం

మహబూబాబాద్, నవంబర్ 25 (ఉద్యమ కెరటం) : మహబూబాబాద్ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల వసతి గృహంలో ఓ డిగ్రీ విద్యార్థిని ప్రసవించిన ఘటన బుధవారం తీవ్ర కల కలం రేపింది. కళాశాల ప్రిన్సిపాల్ వివరాల ప్రకారం.. ఈ ఏడాది జూలైలో కళా శాలలో చేరిన సదరు విద్యార్థిని బుధవారం ఉదయం అసెంబ్లీ సమయంలో గదిలో తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆమెను గమనించిన సిబ్బంది వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే ప్రసవం జరగగా, పుట్టిన శిశువు మృతి చెందింది. ప్రస్తుతం హాస్పిటల్‌లో విద్యార్థినికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులతో పాటు ఐసీడీఎస్, వైద్య, పోలీసు శాఖలకు సమాచారం అందించామని, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

విద్యార్థినికి ప్రసవం జరిగే వరకు కళాశాల, హాస్టల్ యాజమాన్యం ఏం చేస్తోందంటూ పలు విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతి గృహంలో విద్యార్థినులపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయ ని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల ప్రిన్సిపల్ సహా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పదవులు మూడు తలనొప్పులు ముప్పై!

మొదటి పేజీ తరువాయి

తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు వచ్చే ఏడాది మార్చిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పదవుల భర్తీ రాష్ట్ర వ్యవహారాల నూతన ఇన్‌ఛార్జి బీఎం సందీప్‌కు కీలక పరీక్షగా మారింది. ఇటీవల రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు సామ రామ్మోహన్‌రెడ్డి, రామిరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిలను కాంగ్రెస్ ఎంపిక చేసింది. ఇద్దరూ ఒకే సామాజికవర్గానికి చెందినవారు కావడంతో గవర్నర్ కోటా నియామకాల్లో ఇతర సామాజికవర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. బీసీ వర్గం నుంచి పద్మశాలి సామాజికవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, పున్న కైలాష్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ముదిరాజ్ సామాజికవర్గం నుంచి నీలం మధు, మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ ప్రయత్నాలు చేస్తున్నారు. వీరితోపాటు చనగాని దయాకర్, సత్తు మల్లేశ్, కౌశిక్ యాదవ్ కూడా ఎమ్మెల్సీ పదవులను ఆశిస్తున్నట్లు సమాచారం. బ్రాహ్మణ సామాజికవర్గం నుంచి ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు, మైనార్టీ వర్గం నుంచి షబ్బీర్ అలీ పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ఎస్సీ వర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, చాడగొండ వెంకటేశ్, ఎస్టీ వర్గం నుంచి సీనియర్ నేత బెల్లయ్య నాయక్ ప్రయత్నాలు చేస్తున్నారు. వీరితోపాటు కొండా మురళి, బోరెడ్డి అయోధ్యరెడ్డి, ఆరెపల్లి మోహన్ కూడా పార్టీ నాయకత్వం వద్ద తమ వాదనలు వినిపిస్తున్నట్లు తెలుస్తోంది. సామాజిక సమతూకంతోపాటు పార్టీకి చేసిన సేవలు, రాజకీయ ప్రాధాన్యాన్ని పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉండటంతో అధిష్ఠానానికి ఈ వ్యవహారం క్లిష్టంగా మారింది. ఇప్పటికే కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు సొంత ప్రభుత్వంపై బహిరంగంగా



అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి సమయంలో ఎమ్మెల్సీ పదవుల పంపిణీలో ఆశావహులకు నిరాశ ఎదురైతే అంతర్గత విభేదాలు మరింత పెరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న మూడు గవర్నర్ కోటా స్థానాలను వెంటనే భర్తీ చేయాలా? లేక వచ్చే ఏడాది మార్చిలో ఖాళీ కానున్న అసెంబ్లీ కోటా ఎమ్మెల్సీ స్థానాలతో కలిపి ఒకేసారి భర్తీ చేయాలా? అనే అంశంపై పార్టీ నాయకత్వం సమాలోచనలు జరుపుతున్నట్లు సమాచారం. ఇప్పుడే ముగ్గురిని ఎంపిక చేస్తే మిగిలిన ఆశావహులకు కార్పొరేషన్ పదవులు కల్పిస్తామని భరోసా ఇచ్చే ఆలోచన కూడా ఉన్నట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి బీఎం సందీప్ ఈ అంశంపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. మూడు పదవులకు 30 మంది పోటీపడుతున్న నేపథ్యంలో సామాజిక సమీకరణాలను పాటిస్తూ పదవుల పంపిణీ చేపట్టడంతోపాటు మిగిలిన ఆశావహులను సందీప్ ఎలా సముదాయిస్తారన్నది కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

పౌల్ట్రీ పరిశ్రమకు సర్కారు చేయూత!

- త్వరలో సమగ్ర విధానం.. సింగిల్ విండో ద్వారా అనుమతులు
- భారత్ ఫ్యూచర్ సిటీలో కన్వెన్షన్ సెంటర్‌కు భూమి
- సంక్షోభ సమయాల్లో దాణా సరఫరాకు సహకారం
- మొక్కజొన్న, సోయాబీన్ సరఫరాపై 48 గంటల్లో నిర్ణయం
- పెట్టుబడులకు పూర్తి రక్షణ కల్పిస్తాం
- 18వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): పౌల్ట్రీ పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, అనుమతుల మంజూరులో జాప్యాన్ని నివారించేందుకు త్వరలోనే సమగ్ర విధానంతో సింగిల్ విండో వ్యవస్థను అమల్లోకి తీసుకొస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లోని హైటెక్స్ ప్రదర్శన కేంద్రంలో ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్(ఐపెమా) ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే 18వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో–2026ను సీఎం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో కోళ్ల పరిశ్రమల స్థాపనకు అనుమతులు, భూ వినియోగ మార్పిడి విషయంలో జాప్యం జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. పట్టణాల్లో బిల్డ్‌నౌ ద్వారా అమలు చేస్తున్న సింగిల్ విండో అనుమతుల విధానాన్ని త్వరలో గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తామని వెల్లడించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులు సమగ్ర ప్రతిపాదనలతో ముందుకు రావాలని సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో పౌల్ట్రీ పరిశ్రమకు ప్రత్యేకంగా అత్యాధునిక కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన భూమిని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. పౌల్ట్రీ పరిశ్రమ సంక్షోభాలను ఎదుర్కొన్నప్పుడు మొక్కజొన్న, సోయాబీన్ వంటి దాణా ముడిసరుకుల సరఫరాలో ప్రభుత్వం అండగా నిలుస్తుందని సీఎం భరోసా ఇచ్చారు. ఎల్‌నినో ప్రభావం, కరువు పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వ నిల్వలను పరిశీలించి పౌల్ట్రీ పరిశ్రమకు అవసరమైన మేరకు మొక్కజొన్న, సోయాబీన్ అందించే అంశంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. అందుబాటులో ఉన్న నిల్వలు, సరఫరా చేయగల పరిమాణం, ధరలపై వ్యవసాయ శాఖ మంత్రితో సమీక్షించి 48 గంటల్లో తగిన నిర్ణయం తీసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరికి సూచించారు. పౌల్ట్రీ పరిశ్రమ రైతులు, వ్యవసాయ కూలర్లకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో ప్రయోజనం చేకూరుస్తోందని సీఎం ప్రశంసించారు. రైతులు పండించే మొక్కజొన్న, సోయాబీన్‌తోపాటు నూకలు, తౌడు వంటి ఉప ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ వ్యవసాయ రంగానికి అండగా నిలుస్తోందన్నారు. తెలంగాణలో ప్రతిరోజూ 5.30 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో వారానికి మూడు గుడ్లతోపాటు కోడిమాంసంతో భోజనం అందిస్తూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించగలుగుతున్నామని పేర్కొన్నారు. వరుసగా 18 ఏళ్లుగా హైదరాబాద్‌లో పౌల్ట్రీ ప్రదర్శనలు నిర్వహిస్తున్న ప్రతినిధులను అభినందించారు. ఐటీ, ఔషధ, రక్షణ రంగాలతో సమానంగా పౌల్ట్రీ పరిశ్రమను కూడా ప్రాధాన్య రంగంగా ప్రభుత్వం గుర్తించిందని సీఎం తెలిపారు. తెలంగాణలో విధానపరమైన ప్రతిష్టంభనకు తావులేదని, గత మూడు దశాబ్దాల్లో ప్రభుత్వాలు అమలు చేసిన మంచి విధానాలను కొనసాగిస్తూ మరింత మెరుగుపరుస్తున్నామని చెప్పారు. దేశ జనాభాలో 2.5 శాతం ఉన్న తెలంగాణ దేశ స్థూల దేశీయోత్పత్తిలో ప్రస్తుతం 5 శాతం వాటా అందిస్తోందని, దానిని 10 శాతానికి పెంచడమే లక్ష్యమన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. పెట్టుబడిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి పెట్టుబడులకు పూర్తి రక్షణ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ, మాజీ ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డి, ఐపెమా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్‌తోపాటు పౌల్ట్రీ రంగానికి చెందిన జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు

- డిసెంబర్ 11 నుంచి 22 వరకు క్రీడా సంబరాలు
- ఎల్బీ స్టేడియంలో ప్రారంభం.. గచ్చిబౌలిలో ముగింపు
- జిల్లాల వారీగా మంత్రులకు పర్యవేక్షణ బాధ్యతలు
- నాణ్యతలో రాజీ వద్దన్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): ఖేలో ఇండియా–2026 జాతీయ క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన.. పోటీల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, క్రీడాకారులకు కల్పించాల్సిన వసతులపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఖేలో ఇండియా–2026 పోటీల బ్రోచర్‌ను సీఎం విడుదల చేశారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరిగే ఈ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

ప్రారంభ, ముగింపు వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు

డిసెంబర్ 11న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సీఎం సూచించారు. డిసెంబర్ 22న గచ్చిబౌలి స్టేడియంలో జరిగే ముగింపు వేడుకలకు కూడా విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోటీలు జరిగే రోజుల్లో హైదరాబాద్ నగరంతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ క్రీడా వాతావరణం కనిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం పోలీసు, మున్సిపల్ శాఖల అధికారులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రతి విభాగానికి ప్రత్యేక ఇన్‌ఛార్జిని నియమించి, చేపట్టిన పనులకు సంబంధించి స్పష్టమైన బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు.

జిల్లాల వారీగా మంత్రులకు బాధ్యతలు

వివిధ జిల్లాల్లో జరిగే క్రీడా పోటీల ఏర్పాట్లను పర్యవేక్షించే బాధ్యతలను మంత్రులకు అప్పగించాలని సీఎం నిర్ణయించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఇన్‌ఛార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబులతో సమన్వయం చేసుకుంటూ క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జూపల్లి కృష్ణారావు, వరంగల్‌లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్‌లో అడ్లూరి లక్ష్మణ్, ఖమ్మంలో తుమ్మల నాగేశ్వర్ రావు, నిజామాబాద్ పరిధిలో సుదర్శన్ రెడ్డికి బాధ్యతలు అప్పగించాలని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని పేర్కొన్నారు.

వసతి, ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ

పోటీల్లో పాల్గొనే క్రీడాకారులతో పాటు కార్యక్రమాలకు హాజరయ్యే ఆహ్వానితులకు ఆహారం, వసతి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. స్టేడియంల ఆధునికీకరణ, మరమ్మతులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం



ఇవ్వాలని స్పష్టం చేశారు. పనుల నాణ్యతలో నిర్లక్ష్యం వహించినా, ప్రమాణాలు పాటించకపోయినా సహించేది లేదని హెచ్చరించారు. తెలంగాణలో క్రీడారంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ పోటీలను ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి, వారికి మెరుగైన శిక్షణ అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకోసం దేశంలో పేరొందిన అత్యుత్తమ కోచ్‌ల సేవలను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. క్రీడల్లో రాణించే సామర్థ్యం ఉన్న యువతకు తగిన అవకాశాలు కల్పించి, రాష్ట్రం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు.

ఇంటర్ బోర్డు విలీనాన్ని ఒప్పుకోం!

- విద్యావేత్తలు, తల్లిదండ్రులతో చర్చించాకే నిర్ణయం తీసుకోవాలి
- విద్యార్థులపై అదనపు ఫీజుల భారం పడే ప్రమాదం
- తెలంగాణకు కేంద్రం కరువు సాయం అందించాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత



నిజామాబాద్, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో ఏకపక్షంగా విలీనం చేస్తామంటే ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బుధవారం నిజామాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలలు, ఇంటర్ కళాశాలల యాజమాన్యాలు, విద్యావేత్తలతో సమగ్రంగా చర్చించిన తర్వాతే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సూచించారు. విలీనం అనంతరం అవసరమైన మౌలిక సదుపాయాలను ఎలా కల్పిస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఇంటర్మీడియట్ విద్య కోసం తల్లిదండ్రులు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారని, కొత్తగా తొమ్మిది, పది తరగతులను కూడా కలిపితే ఫీజుల భారం మరింత పెరిగే ప్రమాదముందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించకుండా విలీనానికి ముందుకెళ్తే అనేక సమస్యలు తలెత్తుతాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొన్న సందేహాలను ప్రభుత్వం నివృత్తి చేయాలని కోరారు. కరువు బారిన పడిన తెలంగాణను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కవిత డిమాండ్ చేశారు. ఇందుకోసం రాష్ట్ర బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. 16వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాకపోవడంతో సర్పంచులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కేంద్రంతో పోరాడి నిధులు సాధించాలని సూచించారు. నిజామాబాద్ జిల్లాలో కేవలం 18 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం సరికాదని, మిగిలిన మండలాల్లోనూ కరువు పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. పునఃసర్వే నిర్వహించి కరువు మండలాల జాబితాను సవరించాలని కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పాదయాత్రలు చేస్తుంటే, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సమావేశాలు నిర్వహిస్తూ ప్రచారానికే ప్రాధాన్యమిస్తున్నాయని విమర్శించారు. కరువు పేరుతో రైతులను పంటలు సాగు చేయవద్దని సూచిస్తున్న ప్రభుత్వం వారిని ఏ విధంగా ఆదుకుంటుందో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఆరుతడి పంటలకు ఎంత ధర చెల్లిస్తారో ముందుగానే ప్రకటించాలన్నారు. ఇప్పటికే యూరియా కొరత, విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వ్యవసాయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని పంటల సాగుపై రైతులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. రాజ్యాధికారంలో మహిళలకు సముచిత భాగస్వామ్యం కల్పించడమే లక్ష్యంగా రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కవిత ఆధ్వర్యంలో 'మహిళలు--రాజ్యాంగం' సదస్సు నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సుకు వెయ్యి మందికిపైగా మహిళా కార్యకర్తలు హాజరుకానున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కొత్త ఓటర్ల లిస్ట్ రిలీజ్

- రెండు పట్టభద్రుల స్థానాల్లో 11.89 లక్షల ఓటర్లకు ఆమోదం
- 12.69 లక్షల దరఖాస్తుల పరిశీలన పూర్తి
- 80,635 దరఖాస్తుల తిరస్కరణ
- డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, కొత్త దరఖాస్తులు
- 30న తుది ఓటర్ల జాబితా ప్రకటన

హైదరాబాద్, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): తెలంగాణలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాలను ఎన్నికల అధికారులు విడుదల చేశారు. రాబోయే శాసనమండలి ఎన్నికల కోసం చేపట్టిన ఓటరు నమోదు ప్రక్రియలో అందిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఈ జాబితాలను ప్రచురించారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 12,69,826 దరఖాస్తులు అందాయి. వీటిలో 11,89,191 దరఖాస్తులకు ఆమోదం తెలపగా, నిబంధనలకు అనుగుణంగా లేని మరో 80,635 దరఖాస్తులను తిరస్కరించారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 5,99,419 దరఖాస్తులు ఎన్నికల అధికారులకు అందాయి. వీటిని పరిశీలించిన అధికారులు 5,68,105 దరఖాస్తులను ఆమోదించారు. సరైన ద్రువపత్రాలు సమర్పించకపోవడం, ఇతర నిబంధనలను పాటించకపోవడం వంటి కారణాలతో 31,314 దరఖాస్తులను తిరస్కరించారు. ఈ నియోజకవర్గ పరిధిలోని 156 మండలాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి చేసి ముసాయిదా జాబితాను అందుబాటులోకి తెచ్చారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గంలో 6,70,407 దరఖాస్తులు అందాయి. వీటిలో 6,21,086 దరఖాస్తులను అధికారులు ఆమోదించగా, వివిధ కారణాలతో 49,321 దరఖాస్తులను తిరస్కరించారు. ఈ నియోజకవర్గంలోని 192 మండలాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ కూడా పూర్తయింది. రెండు నియోజకవర్గాల్లోనూ దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హులైన పట్టభద్రులకు జాబితాలో చోటు కల్పించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేర్లు నమోదయ్యాయో



లేదో పట్టభద్రులు పరిశీలించుకోవాలని ఎన్నికల అధికారులు సూచించారు. పేర్లు నమోదు కాకపోయినా, జాబితాలోని వివరాలపై అభ్యంతరాలు ఉన్నా డిసెంబర్ 10వ తేదీలోగా ఫామ్-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అందిన అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించిన అనంతరం డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


డ్రగ్స్‌కు నో చెప్పండి.. జీవితానికి ఎస్ చెప్పండి

- మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కదలాలి
- 2029 నాటికి డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యం
- యువత భవిష్యత్తును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ
- తల్లిదండ్రులు పిల్లలకు సమయం కేటాయించాలి
- ప్రముఖ సినీ నటుడు విక్టరీ వెంకటేష్



హైదరాబాద్, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని ప్రముఖ సినీ నటుడు విక్టరీ వెంకటేష్ పిలుపునిచ్చారు. 2029 నాటికి భారత్‌ను డ్రగ్స్ రహిత దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేపట్టిన ప్రయత్నాలకు ప్రజలంతా మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు యువతే ప్రధాన బలమని, వారిని మాదకద్రవ్యాల వ్యసనానికి దూరంగా ఉంచడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నేతృత్వంలో హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న 'హైదరాబాద్ వాక్స్.. నషా ముక్త్ భారత్' కార్యక్రమంలో వెంకటేష్ పాల్గొన్నారు. మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు కిషన్ రెడ్డి చేపట్టిన పాదయాత్రను అభినందించారు. ఈ ఉద్యమాన్ని నిబద్ధతతో ముందుకు తీసుకెళ్తున్న కేంద్ర మంత్రిని ప్రశంసించారు. వివిధ వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి డ్రగ్స్ వ్యతిరేక పోరాటానికి బాటలు వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు చదువు, లక్ష్యాలు, భవిష్యత్తు కూడా ప్రభావితమవుతున్నాయని వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలు బాధితుల కుటుంబ సభ్యులు, స్నేహితులకు సైతం తీవ్ర ఆవేదన కలిగిస్తున్నాయని చెప్పారు. డ్రగ్స్‌కు అలవాటుపడిన యువతను వెలివేయకుండా వారిలో మార్పు తీసుకొచ్చేందుకు కుటుంబ సభ్యులు, స్నేహితులు తోడ్పడాలని సూచించారు. వ్యసనం నుంచి బయటపడేందుకు వారికి ధైర్యం చెప్పి అవసరమైన సహకారం అందించాలని కోరారు. ఈ ఉద్యమానికి సంఘీభావం తెలిపేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. యువత తమ జీవిత విలువను గుర్తించాలని, తోటివారి ఒత్తిడికి ప్రభావితమై చెడు అలవాట్లకు లోనుకావద్దని సూచించారు. 'మీ జీవితం ఎంతో విలువైనది. డ్రగ్స్‌కు బానిసలు కావద్దు. మేల్కొనండి. మీకు అండగా నిలవడానికి మేమందరం ఉన్నాం. తోటివారి ఒత్తిడికి లొంగిపోవద్దు. మీ లక్ష్యాలకు, భవిష్యత్తుకు డ్రగ్స్ అడ్డంకిగా మారనివ్వకండి' అని సందేశమిచ్చారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని వెంకటేష్ పేర్కొన్నారు. పిల్లలతో ఓపికగా మాట్లాడేందుకు సమయం కేటాయించాలని, వారి మనసులోని ఆందోళనలు, ఇబ్బందులను శ్రద్ధగా వినాలని కోరారు. తమ సమస్యలను ఎలాంటి భయం, సంకోచం లేకుండా తల్లిదండ్రులతో పంచుకునే వాతావరణాన్ని ఇంట్లో కల్పించాలని సూచించారు. అప్పుడే పిల్లలకు సరైన సమయంలో అవసరమైన సహాయం అందించడం సాధ్యమవుతుందని వివరించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని వెంకటేష్ పిలుపునిచ్చారు. 'డ్రగ్స్‌కు నో చెబుదాం.. జీవితానికి ఎస్ చెబుదాం. డ్రగ్స్ వద్దు.. జీవితమే ముద్దు' అంటూ నినదించారు. మాదకద్రవ్యాల వ్యసనం నుంచి బయటపడాలనుకునే వారికి 14446 హెల్ప్‌లైన్ ద్వారా సహాయం పొందే అవకాశం ఉందని గుర్తుచేశారు. సమస్యలు ఎదురైనప్పుడు వాటిని దాచిపెట్టకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులతో మాట్లాడాలని, అవసరమైన సహాయం కోరేందుకు వెనుకాడవద్దని యువతకు సూచించారు.





తెలంగాణ ప్రయోజనాలు ఏపీకి తాకట్టు

- పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుపై కేఆర్ఎంబీ సమావేశంలో ఎందుకు ప్రశ్నించలేదు?
- మేధావులు, తెలంగాణవాదులు ఆలోచించాలి
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు

హైదరాబాద్, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): నాగార్జునసాగర్ జలాలను తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. బుధవారం హైదరాబాద్ వేదికగా జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశంలో ఏపీ ప్రాజెక్టును అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గళమెత్తలేదని ఆరోపిస్తూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి అడుగులకు మడుగులొత్తుతూ రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని, ఏపీ ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. గతంలో ఢిల్లీ వేదికగా జరిగిన సమావేశంలో గోదావరి జలాలను తరలించే బనకచర్ల ప్రాజెక్టుపై నిలదీయకుండా జలద్రోహానికి పాల్పడ్డారని, ఇప్పుడు హైదరాబాద్‌లో జరిగిన కేఆర్ఎంబీ సమావేశంలో కృష్ణా జలాలను తరలించే పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును ప్రశ్నించకుండా మరోసారి ద్రోహం చేశారని మండిపడ్డారు. ప్రాజెక్టులు, వేదికలు మారుతున్నా ఏపీకి సహకరించే ముఖ్యమంత్రి వైఖరి మాత్రం మారడం లేదని ధ్వజమెత్తారు. కేఆర్ఎంబీ సమావేశంలో పల్నాడు ప్రాజెక్టు ప్రస్తావనే రాలేదని స్వయంగా ఏపీ ఇంజనీర్లే చెబుతుంటే, సమావేశంలో ఆ ప్రాజెక్టుపై చర్చించామని ప్రచారం చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ఏం సమాధానం చెబుతుందని హరీశ్ రావు ప్రశ్నించారు. నాడైనా, నేడైనా నీళ్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు తీరని ద్రోహం చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడాల్సిన ముఖ్యమంత్రే ఏపీకి లొంగిపోతుంటే రాష్ట్రానికి రక్షణ ఎవరని నిలదీశారు. ఈ పరిణామాలపై మేధావులు, తెలంగాణవాదులు లోతుగా ఆలోచించాలని విజ్ఞప్తి చేస్తూ, ఇది చారిత్రక ద్రోహమని, తెలంగాణ సమాజం క్షమించదని హరీశ్ రావు స్పష్టం చేశారు.

గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులకు రూ.1,100 కోట్లు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

భద్రాచలం, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): భక్తుల ఆకాంక్షలకు మించి భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. రాబోయే గోదావరి పుష్కరాల నాటికి అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణతో కలిసి ఆలయ పునరుద్ధరణ, రాతి కట్టడాల నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు బూసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలోని పుణ్యక్షేత్రాలను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి తెలిపారు. గోదావరి పుష్కరాల అభివృద్ధి పనుల కోసం వివిధ శాఖల ద్వారా ఇప్పటికే రూ.1,100 కోట్లకు పైగా నిధులు కేటాయించామని వెల్లడించారు. భద్రాద్రి రామాలయ అభివృద్ధికి రూ.300 కోట్లు కేటాయించామని, అవసరమైతే అదనపు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఆలయ రాతి కట్టడాలు భవిష్యత్ తరాలకు శాశ్వత ఆస్తిగా నిలిచేలా అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని సూచించారు. డిసెంబర్ 19న ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆలయ అభివృద్ధి, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. కనీసం 300 మంది కార్మికులతో ఆలయ అభివృద్ధి పనులు కొనసాగించాలని, అవసరమైన సాంకేతిక, ఇంజినీరింగ్ సిబ్బందిని సమకూర్చుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నిర్మాణ సమూనాలను వెంటనే పూర్తి చేయడంతోపాటు రాతి కట్టడాలకు అవసరమైన సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. పనుల్లో జాప్యానికి తావివ్వకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఉత్తర, దక్షిణ పుష్కర ఘాట్ల నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని, రహదారుల విస్తరణ, వంతెనల నిర్మాణ ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. కరకట్టల నిర్మాణంతో రైతులు, స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రజాప్రతినిధులతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు.



ఉద్యమ కెరటం
నిజం రక్షణే లక్ష్యం UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



ట్రంప్ టారిఫ్ బాంబ్

భారత్‌పై 25, చైనాకు 40 శాతం

వియత్నాంపై 35 శాతం విధించే అవకాశం

పలు వాణిజ్య భాగస్వామ్య దేశాలపైనా అదనపు భారం

వాషింగ్టన్, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం మరోసారి సుంకాల పెంపునకు సిద్ధమవుతోంది. భారత్‌తోపాటు పలు ప్రధాన వాణిజ్య భాగస్వామ్య దేశాలపై కొత్త సుంకాలు విధించేందుకు అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం (యూఎస్‌టీఆర్) ప్రతిపాదనలు రూపొందించినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. భారత్‌పై 25 శాతం వరకు, చైనాపై అత్యధికంగా 40 శాతం వరకు సుంకాలు విధించాలని ప్రతిపాదించినట్లు పేర్కొంటున్నాయి. కంబోడియా, ఇండోనేషియా, దక్షిణ కొరియా, మలేషియా, తైవాన్, థాయ్‌లాండ్‌లపైనా 25 శాతం వరకు సుంకాల ప్రతిపాదనలు ఉన్నాయి. బంగ్లాదేశ్, యూరోపియన్ యూనియన్, జపాన్, స్విట్జర్లాండ్, సింగపూర్‌లపై 20 శాతం వరకు, వియత్నాంపై 35 శాతం వరకు సుంకాలు విధించాలని ప్రతిపాదించారు. అయితే కొన్ని దేశాలకు ప్రత్యేక పరిమితులను పేర్కొన్నారు. కంబోడియా, ఇండోనేషియా, మలేషియా, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్‌లకు గరిష్ఠంగా 18 శాతం పరిమితి ఉండనుంది. దక్షిణ కొరియా, తైవాన్, యూరోపియన్ యూనియన్, జపాన్, స్విట్జర్లాండ్‌లకు 15 శాతం రేటును పేర్కొనగా, చైనాపై ఇప్పటికే అమలులో ఉన్న సుంకాలకు అదనంగా 20 శాతం విధించే అంశం ప్రతిపాదనల్లో ఉన్నట్లు సమాచారం. బ్రెజిల్‌కు సంబంధించిన ప్రతిపాదిత మార్పులపై 2027 జనవరి 14న విచారణ జరగనుంది. అమెరికా వాణిజ్య లోటును తగ్గించడంతోపాటు విదేశాల్లోని అదనపు పారిశ్రామిక ఉత్పత్తి సామర్థ్యాన్ని నియంత్రించడమే ఈ చర్యల ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ప్రభుత్వ రాయితీలు, ఆర్థిక సహాయంతో విదేశీ తయారీదారులు తక్కువ వ్యయంతో వస్తువులను ఉత్పత్తి చేస్తున్నారని, తద్వారా అమెరికా దేశీయ పరిశ్రమలు నష్టపోతున్నాయని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. పారిశ్రామిక రాయితీలపై సుదీర్ఘ దర్యాప్తు అనంతరం ఈ ప్రతిపాదనలు రూపొందించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. తాజా ప్రతిపాదనలు అమల్లోకి వస్తే అంతర్జాతీయ వాణిజ్యంపై గణనీయమైన ప్రభావం పడే అవకాశం ఉంది.

ఐదు కీలక ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

- కామరాజర్ పోర్టులో రెండో కంటైనర్ టెర్మినల్
- దోలూలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం
- పరికరాల తయారీకి రూ.11 వేల కోట్ల పథకం
- తపాలా శాఖకు రూ.2,632 కోట్ల కేటాయింపులు



న్యూఢిల్లీ, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, రవాణా సామర్థ్యం పెంపు, పారిశ్రామిక రంగానికి ఊతమిచ్చే ఐదు కీలక ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తమిళనాడులోని కామరాజర్ పోర్ట్‌లో రెండో కంటైనర్ టెర్మినల్ నిర్మాణానికి రూ.4,288.26 కోట్లు, అసోంలోని సిల్చార్ సమీపంలో దోలూ వద్ద గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం అభివృద్ధికి రూ.2,014 కోట్లు వెచ్చించనున్నారు. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కామరాజర్ పోర్ట్ లిమిటెడ్‌లో రెండో కంటైనర్ టెర్మినల్‌ను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో (పీపీపీ) డీబీఎఫ్ఓటీ పద్ధతిలో నిర్మించనున్నారు. మొత్తం రూ.4,288.26 కోట్ల అంచనా వ్యయంలో మొదటి దశకు రూ.2,429.32 కోట్లు, రెండో దశకు రూ.1,858.94 కోట్లు కేటాయించారు. 40 ఏళ్ల రాయితీ కాలపరిమితిలో భాగంగా 48 నెలల్లో నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. 900 మీటర్ల పొడవు, 18 మీటర్ల డ్రాఫ్ట్‌తో రూపుదిద్దుకోనున్న ఈ టెర్మినల్ ద్వారా ఏటా 20 లక్షల టీఈయూల కంటైనర్లను నిర్వహించే సామర్థ్యం అందుబాటులోకి వస్తుంది. తమిళనాడుతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పారిశ్రామిక ప్రాంతాల నుంచి జరిగే ఎగుమతులు, దిగుమతుల రవాణాకు ఈ టెర్మినల్ కీలకంగా మారనుంది. నిర్మాణ దశలో సుమారు 750 మందికి, కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత మరో 800 మందికి ఉపాధి లభించనుంది. టెర్మినల్ ఏర్పాటుకు అవసరమైన డ్రెడ్జింగ్ పనుల కోసం కామరాజర్ పోర్ట్ అదనంగా రూ.450 కోట్లు ఖర్చు చేయనుంది. అసోంలోని కచార్ జిల్లాలో బరాక్ లోయకు ప్రధాన కేంద్రంగా ఉన్న దోలూ వద్ద రూ.2,014 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని నిర్మించనున్నారు. ఇందులో 12,351 చదరపు మీటర్ల విస్తీర్ణంలో టెర్మినల్ భవనాన్ని ఏర్పాటు చేస్తారు. రద్దీ సమయాల్లో గంటకు 800 మంది ప్రయాణికులకు సేవలందించేలా దీనిని రూపొందించనున్నారు. ఎయిర్‌బస్ ఏ-320 విమానాల రాకపోకలకు అనువుగా 2,705 మీటర్ల రన్‌వే, ఆరు విమానాలను నిలిపే సామర్థ్యంతో ఆప్రాన్ నిర్మిస్తారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ప్రాంతంలోని తేయాకు పరిశ్రమ, పర్యాటకం, వాణిజ్య కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం లభించనుంది. ఈశాన్య భారతంలో రవాణా అనుసంధానం కూడా మెరుగుపడనుంది. నిర్మాణ, మౌలిక సదుపాయాల రంగాలకు అవసరమైన యంత్రాలు, పరికరాల తయారీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు రూ.11,000 కోట్లతో ప్రత్యేక పథకాన్ని అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఎనిమిదేళ్లపాటు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో భాగంగా షిప్-టు-షోర్ క్రేన్లు, టన్నెల్ బోరింగ్ యంత్రాలు, హైడ్రాలిక్ ఎక్స్‌కవేటర్ల వంటి అధునాతన పరికరాల దేశీయ ఉత్పత్తికి ప్రోత్సాహం అందించనున్నారు. వీటి నాణ్యత, సామర్థ్యాలను పరీక్షించేందుకు ప్రత్యేక పరీక్షా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తారు. 2024-25లో సుమారు రూ.97,500 కోట్లుగా ఉన్న భారత నిర్మాణ పరికరాల పరిశ్రమ మార్కెట్ విలువ 2029-30 నాటికి రూ.2,28,100 కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. ఇక తపాలా శాఖకు సంబంధించిన రెండు పథకాలకు కూడా మంత్రివర్గం నిధులు కేటాయించింది. పోస్టల్ ఆపరేషన్స్ పథకానికి రూ.1,141 కోట్లు, ఎస్టేట్స్ మేనేజ్‌మెంట్ పథకానికి రూ.1,491 కోట్లు మంజూరు చేసింది. ఈ రెండు పథకాలకు కలిపి రూ.2,632 కోట్ల వ్యయం చేయనున్నారు.

రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో

భారీ ఊరట!

ఆస్తుల ఆరోపణలపై అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు రద్దు


సీబీఐ, ఈడీలకు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసిన ధర్మాసనం

న్యూఢిల్లీ, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలకు సంబంధించిన వ్యవహారంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆయనపై వచ్చిన ఆరోపణలను పరిశీలించాలని సీబీఐ, ఈడీలను ఆదేశిస్తూ అలహాబాద్ హైకోర్టు గతంలో జారీ చేసిన ఉత్తర్వులను సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసింది. పిటిషన్‌పై మొదటి నుంచి విచారణ చేపట్టాలని హైకోర్టును ఆదేశించింది. ఫిర్యాదుదారు దాఖలు చేసిన పిటిషన్ చట్టపరంగా విచారణకు అర్హమైనదా? కాదా? అనే అంశంతోపాటు అన్ని కోణాలను పరిశీలించాలని స్పష్టం చేసింది. కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త ఎస్. విఘ్నేష్ శిశిర్.. రాహుల్ గాంధీ తెలిసిన ఆదాయ వనరులకు మించి ఆస్తులు కూడబెట్టారని ఆరోపిస్తూ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మే 12న విచారణ చేపట్టిన హైకోర్టు లక్నో ధర్మాసనం ఆరోపణలను చట్టప్రకారం పరిశీలించాలని సీబీఐ, ఈడీలను ఆదేశించింది. అనంతరం తీసుకున్న చర్యలు, విచారణ పురోగతిపై నివేదికలు సమర్పించాలని కోరింది. జూలై 20న జరిగిన విచారణలో సీబీఐ సమాధానంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ మరింత స్పష్టమైన నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అసలు ఈ వ్యవహారంలో కోర్టును ఆశ్రయించే చట్టపరమైన అర్హత ఫిర్యాదుదారుకు ఉందా? అని ప్రశ్నించారు. ఆగస్టు 17న పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు హైకోర్టు విచారణపై మధ్యంతర స్టే విధించింది. దర్యాప్తునకు సంబంధించిన నివేదికలను హైకోర్టుకు సమర్పించవద్దని సీబీఐ, ఈడీ సహా సంబంధిత సంస్థలను ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఫిర్యాదుదారు విఘ్నేష్ శిశిర్ స్వయంగా న్యాయస్థానానికి హాజరయ్యారు. విచారణ అనంతరం అలహాబాద్ హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను రద్దు చేసిన ధర్మాసనం, పిటిషన్‌ను తిరిగి హైకోర్టు పరిశీలనకు పంపింది. దీంతో పిటిషన్ విచారణార్హతతోపాటు ఇతర చట్టపరమైన అంశాలపై హైకోర్టు తాజాగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.



రాజ్యాంగం ఓ హక్కుల పత్రం మాత్రమే కాదు

సంపాదకీయం



భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో నవంబర్ 26వ తేదీకి విశిష్టమైన స్థానం ఉంది. శతాబ్దాల సామాజిక అసమానతలు, వివక్ష, అణచివేతల నుంచి బయటపడి స్వతంత్ర దేశంగా అవతరించిన భారతదేశానికి ఒక సమగ్రమైన రాజ్యాంగాన్ని అందించిన చారిత్రాత్మక రోజు ఇది. 1949 నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్ భారత రాజ్యాంగాన్ని ఆమోదించగా, 1950 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ చారిత్రాత్మక సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ ఏటా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. అయితే రాజ్యాంగ దినోత్సవం అంటే కేవలం ఒక వేడుక కాదు.. దేశ ప్రజాస్వామ్య ప్రయాణాన్ని, రాజ్యాంగ విలువలను, పాలకుల బాధ్యతలను, పౌరుల హక్కులను సమీక్షించుకోవాల్సిన సందర్భం. బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందిన భారతదేశానికి ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మించాల్సిన చారిత్రాత్మక బాధ్యత రాజ్యాంగ పరిషత్‌పై పడింది. 1946 డిసెంబర్ 9న రాజ్యాంగ పరిషత్ తొలిసారిగా సమావేశమైంది. దేశంలోని విభిన్న ప్రాంతాలు, సామాజిక వర్గాలు, భిన్న అభిప్రాయాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ రాజ్యాంగ రూపకల్పన ప్రక్రియ కొనసాగింది. 1947 ఆగస్టు 29న అంబేద్కర్ అధ్యక్షతన రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఏర్పాటైంది. దాదాపు రెండేళ్ల పదకొండు నెలల పదిహేడు రోజుల పాటు జరిగిన విస్తృత చర్చలు, పరిశీలనలు, సవరణల అనంతరం రాజ్యాంగం రూపుదిద్దుకుంది. 1949 నవంబర్ 26న ఆమోదం పొందిన రాజ్యాంగం 1950 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చింది. భారత రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందించిన సేవలు అపారమైనవి. రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడిగా ఆయన చేసిన కృషి భారత ప్రజాస్వామ్యానికి బలమైన పునాదిగా నిలిచింది. సామాజిక వివక్షను స్వయంగా ఎదుర్కొన్న ఆయనకు సమాజంలోని అణగారిన వర్గాల కష్టాలు, సమస్యలు తెలుసు. అందుకే రాజ్యాంగంలో సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం, వ్యక్తిగత గౌరవానికి విశేష ప్రాధాన్యత కల్పించారు. విద్య ద్వారా అభివృద్ధి, సంఘటితం కావడం ద్వారా ఐక్యత, హక్కుల కోసం పోరాటం ద్వారా సామాజిక మార్పు సాధ్యమని ఆయన చాటిచెప్పారు. అంబేద్కర్ ఆశయం కేవలం రాజకీయ స్వాతంత్ర్యంతో ముగిసిపోలేదు. ప్రతి మనిషికి సమాన గౌరవం, సమాన అవకాశాలు, వివక్షలేని జీవనం లభించాలన్నదే ఆయన ఆకాంక్ష. అందుకే రాజ్యాంగాన్ని అర్థం చేసుకోవడం అంటే అంబేద్కర్ ఆశయాలను అర్థం చేసుకోవడమే.



రాజ్యాంగం అమల్లోకి వచ్చి దశాబ్దాలు గడిచినా సమాజంలో అనేక సవాళ్లు కొనసాగుతున్నాయి. కుల వివక్ష, ఆర్థిక అసమానతలు, మహిళలపై వివక్ష, పేదరికం, నిరుద్యోగం, విద్యా వైద్యంలో అంతరాలు ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించినప్పటికీ వాటిని అందిపుచ్చుకునే అవకాశాలు అందరికీ ఒకే విధంగా ఉన్నాయా? అనే ప్రశ్న నేటికీ ప్రాధాన్యత కలిగి ఉంది. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలకు గౌరవం ఉండాలి. ప్రశ్నించే గొంతుకకు విలువ ఉండాలి. చట్టం ముందు అందరూ సమానులనే భావన ఆచరణలో కనిపించాలి. మత సామరస్యం, సామాజిక ఐక్యత, పరస్పర గౌరవం బలోపేతం కావాలి. రాజ్యాంగ విలువలు ప్రసంగాల్లోనే కాకుండా పాలనలో, న్యాయవ్యవస్థలో, విద్యాసంస్థల్లో, సమాజంలో ప్రతిబింబించాలి. భారత రాజ్యాంగం పేదలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, మహిళలు, మైనారిటీలు సహా ప్రతి పౌరుడికి హక్కులు, రక్షణలు కల్పించే వ్యవస్థను ఏర్పరిచింది. సమానత్వపు హక్కు, స్వేచ్ఛా హక్కు, మత స్వాతంత్ర్యం, దోపిడీకి వ్యతిరేకంగా హక్కు, సాంస్కృతిక, విద్యా హక్కులు, రాజ్యాంగ పరిహార హక్కులు పౌరుల గౌరవప్రదమైన జీవనానికి పునాదులు. అంటరానితనం నిర్మూలన, వివక్షకు వ్యతిరేక రక్షణలు, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు రాజ్యాంగ స్ఫూర్తిలో భాగంగా అమలవుతున్నాయి. అయితే హక్కులు కాగితాలకే పరిమితం కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలి. పేదలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రత అందినప్పుడే రాజ్యాంగ లక్ష్యాలకు నిజమైన అర్థం చేకూరుతుంది.

ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజల నుంచి వస్తుంది. ప్రజాప్రతినిధులు రాజ్యాంగానికి అనుగుణంగా వ్యవహరిస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ప్రజల ప్రాథమిక అవసరాలైన విద్య, వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, ఉపాధి, రహదారులు, సామాజిక భద్రతపై దృష్టి సారించాలి. ప్రభుత్వాలు చట్టబద్ధమైన పాలన అందించాలి. సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా చూడాలి. బలహీన వర్గాల హక్కులను పరిరక్షించాలి. అవినీతి, వివక్ష, అధికార దుర్వినియోగానికి తావులేకుండా పారదర్శకత, జవాబుదారీతనంతో పరిపాలన సాగించాలి. ప్రజల సమస్యలను వినడం, పరిష్కరించడం ప్రజాప్రతినిధుల ప్రాథమిక బాధ్యతగా ఉండాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా పాత్ర అత్యంత కీలకం. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడం మీడియా ప్రధాన బాధ్యత. పాలకుల నిర్ణయాలను విశ్లేషించడం, ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ప్రభుత్వాల జవాబుదారీతనాన్ని గుర్తుచేయడం, సామాన్యుల గొంతుకను అధికార వ్యవస్థకు వినిపించడం ద్వారా మీడియా ప్రజాస్వామ్య బలోపేతానికి తోడ్పడుతుంది. రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలి. వాస్తవాలను నిర్ధారించకుండా వార్తలు ప్రచురించకూడదు. తప్పుడు సమాచారం, విద్వేష ప్రచారం, వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉండాలి. అధికారంలో ఉన్నవారినే కాకుండా సమాజంలోని అణగారిన వర్గాల సమస్యలను కూడా వెలుగులోకి తీసుకురావాలి. ప్రజలకు రాజ్యాంగ హక్కులు, చట్టాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి. స్వేచ్ఛతో పాటు సామాజిక బాధ్యతను గుర్తించినప్పుడే మీడియా తన ప్రజాస్వామ్య పాత్రను సమర్థవంతంగా నిర్వహించగలదు.

రాజ్యాంగాన్ని కాపాడటం కేవలం ప్రభుత్వాల బాధ్యత కాదు. ప్రతి పౌరుడికి ఇందులో భాగస్వామ్యం ఉంది. రాజ్యాంగాన్ని గౌరవించడం, జాతీయ జెండా, జాతీయ గీతాన్ని గౌరవించడం, దేశ సమైక్యతను కాపాడటం, సోదరభావాన్ని పెంపొందించడం, ప్రజా ఆస్తులను పరిరక్షించడం, పర్యావరణాన్ని కాపాడటం వంటి ప్రాథమిక విధులను ప్రతి ఒక్కరూ నిర్వర్తించాలి. ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలి. ప్రజాప్రతినిధులను ప్రశ్నించాలి. చట్టాలను గౌరవించాలి. ఇతరుల హక్కులకు భంగం కలగకుండా వ్యవహరించాలి. కుల, మత, భాష, ప్రాంతీయ భేదాలకు అతీతంగా మానవత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలి. రాజ్యాంగం గురించి తెలుసుకోవడం, భావితరాలకు అవగాహన కల్పించడం కూడా పౌరుల బాధ్యతే. రాజ్యాంగం కేవలం పాలనా వ్యవస్థకు సంబంధించిన పత్రం కాదు.. కోట్లాది భారతీయుల ఆశలు, ఆకాంక్షలు, హక్కులు, భవిష్యత్తుకు భరోసా ఇచ్చే మహోన్నత మార్గదర్శకం. అంబేద్కర్ ఆశించిన సమానత్వ సమాజం నిర్మాణం కావాలంటే రాజ్యాంగంలోని విలువలు ప్రతి ఒక్కరి జీవితంలో ఆచరణలోకి రావాలి. ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. మీడియా ప్రజల పక్షాన నిలవాలి. పౌరులు తమ హక్కులను తెలుసుకొని విధులను నిర్వర్తించాలి. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మనమంతా ఒక సంకల్పం తీసుకోవాలి. వివక్షలేని సమాజం కోసం, సామాజిక న్యాయం కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కలిసికట్టుగా ముందుకు సాగాలి.

రాజ్యాంగాన్ని గౌరవించడం అంటే అంబేద్కర్ ఆశయాలను గౌరవించడం.. రాజ్యాంగాన్ని పరిరక్షించడం అంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడటం.. సమానత్వాన్ని ఆచరించడం అంటే నిజమైన భారతీయతను చాటడం.

ఎండీ అబ్దుల్ రహమాన్
ఎడిటర్,
ఉద్యమ కెరటం దినపత్రిక



హెచ్‌సీఏ క్రికెట్ ఎంపికలో ఇచ్చోడ క్రీడాకారుల ప్రతిభ

'సన్‌రైజ్' క్రికెట్ అకాడమీ నుంచి నలుగురికి అవకాశం



ఉద్యమ కెరటం, ఇచ్చోడ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో మంచిర్యాలలో నిర్వహించిన అండర్-14 క్రికెట్ సెలెక్షన్స్‌లో ఇచ్చోడకు చెందిన 'సన్‌రైజ్' క్రికెట్ అకాడమీ క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. అకాడమీ నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికై సత్తా చాటారు. కేందిరే వీర్, డి.వెంకట్ రామ ప్లేయింగ్ ఎలెవన్‌లో స్థానం దక్కించుకోగా, కేందిరే సమర్థ్, కె.అక్షుత్ స్టాండ్‌బై క్రీడాకారులుగా ఎంపికయ్యారు. ఒకే అకాడమి నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపిక కావడం పట్ల అకాడమి కోచ్ షేక్ అమాన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన శిక్షణ, ప్రోత్సాహం అందిస్తే ఉన్నత స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఇచ్చోడ ప్రాంతానికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ప్రమాద ఘంటికలు

అదుపుతప్పి కారు బోల్తా

24 గంటలు గడవకముందే మరో ప్రమాదం



ఉద్యమ కెరటం, సత్తుపల్లి: ఖమ్మం జిల్లా వేంసూరు ఎగ్జిట్ సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవేపై బుధవారం ఉదయం మరో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంతో వెళ్తున్న కారు, మరో వాహనం పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు బోల్తా పడగా, మరో వాహనం ముందుభాగం తీవ్రంగా ధ్వంసమైంది. ఢీకొన్న వేగానికి రెండు వాహనాలు రహదారి పక్కన ఉన్న రెయిలింగ్ ప్రాంతంలోకి దూసుకెళ్లాయి. వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అంబులెన్స్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు అత్యవసర వైద్య సహాయం అందించారు. కాగా ఇదే ప్రాంతంలో 24 గంటలు గడవకముందే మరో ప్రమాదం చోటుచేసుకోవడంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేపై వరుస ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ రాజర్షిషా



ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. పట్టణంలోని నీలానగర్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన పసుపుల రాజు నూతన గృహాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించి, లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన గృహాన్ని పరిశీలించి, ఇంటి నిర్మాణ నాణ్యత, కల్పించిన వసతులను తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని చక్కటి గృహాన్ని నిర్మించుకున్న లబ్ధిదారుడిని అభినందించారు. జిల్లాలో అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి పక్కా ఇల్లు అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు పసుపుల రాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సాకారమైందని ఆనందం వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వానికి, సహకరించిన జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, హౌసింగ్ ఈఈ నాసిర్, స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బాలికల విద్యపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత



ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్: బాలికల విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్‌తో కలిసి హాజరై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బేటీ బచావో బేటీ పడావో పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. బాలికలను ఎదగనివ్వాలని, చదివించాలని, ఆడపిల్లలు దేశానికి గర్వకారణమని, వారిని రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. బడిమానేసిన ఆడపిల్లలపై దృష్టి సారించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి తిరిగి బడికి తీసుకురావాలని, బాలికల విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆడపిల్లలకు నైపుణ్య శిక్షణలో భాగంగా బ్యూటీషన్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ కోర్సులు నిర్వహించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహాలలోని బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, షాపింగ్ మాల్స్‌లో పనిచేసే మహిళా ఉద్యోగుల రక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం 2013 ప్రకారం ప్రతి కార్యాలయంలో కమిటీ ఏర్పాటు చేయాలని, బాలికలు, మహిళల హక్కుల పట్ల చైతన్యం తీసుకురావాలని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బాలల కోసం హెల్ప్ లైన్ 1098 ను ఏర్పాటు చేయడం జరిగిందని, సమాచారం తెలిపిన వ్యక్తుల సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని తెలిపారు.అనంతరం బాలికల రక్షణ చట్టాల గోడ ప్రతులను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి స్వరూప, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మహేష్, మహిళా సాధికారత సేవ కేంద్రం సమన్వయకర్త శారద, సిబ్బంది, రాణి, మమత, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిలకు రూ.30 వేల ఆర్థిక సాయం

- **నవంబర్ 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి**

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్: క్రిస్మస్ పండుగను పుర స్కరించుకుని జిల్లాలోని అర్హత కలిగిన చర్చిలకు సున్నం వేయడం, విద్యుత్ దీపాలంకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.30 వేల ఆర్థిక సహాయం అందించ నున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి లక్ష్మీనా రాయణ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. చర్చిలు సొసైటీస్ రిజిస్ట్రేషన్ లేదా ట్రస్ట్ చట్టం కింద నమోదై ఉండాలని, క్రమం తప్పకుండా ప్రార్థనలు జరుగుతూ చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, నిర్వహణ కమిటీ కలిగి ఉండాలని తెలిపారు. ఒక్కో చర్చి నుంచి ఒక దరఖాస్తు మాత్రమే స్వీకరిస్తామని స్పష్టం చేశారు. అర్హత కలిగిన చర్చిల నిర్వాహకులు నవంబర్ 23 నుంచి 30వ తేదీ వరకు tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం దరఖాస్తు ప్రింట్ కాపీతో పాటు చర్చి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, నిర్వహణ కమిటీ తీర్మానం, బ్యాంకు పాస్‌బుక్ లేదా క్యాన్సిల్డ్ చెక్, పాస్టర్ లేదా అధ్యక్షుడు లేదా కార్యదర్శి ఆధార్ కార్డు, చర్చి తాజా ఫొటోలు, నిధులను సున్నం వేయడానికి, దీపాలంకరణకు మాత్రమే వినియోగిస్తామని తెలిపే అండర్‌టేకింగ్ పత్రాన్ని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. గడువు దాటిన, అసంపూర్తి దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. జిల్లాలోని పాస్టర్లు, చర్చి కమిటీ సభ్యులు, క్రైస్తవ నాయకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

న్యాయవాదుల సంక్షేమం, రక్షణకు పెద్దపీట వేయాలి

ఐపీఎల్ డిమాండ్

ఉద్యమ కెరటం, వరంగల్ : ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐ ఏ ఎల్) వరంగల్, హనుమకొండ జిల్లా కౌన్సిల ఆధ్వర్యంలో బుధవారం వరంగల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి రూపొందించిన 10 డిమాండ్ల పోస్టర్‌ను ఆవిష్కరించి, అనంతరం వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. గీతామా, హనుమకొండ జిల్లా జడ్జి ఎం.ఆర్. సునీతకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐఏఎల్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి భీమనాథ్ శ్రీనివాస్ మాట్లాడుతూ డిజిటలైజేషన్ పేరుతో న్యాయవాదులు, కక్షిదారులకు ఇబ్బందులు కలగకుండా ఈ-ఫైలింగ్‌తో పాటు భౌతిక ఫైలింగ్‌ను కొనసాగించాలని, జూనియర్ న్యాయవాదులకు నెలవారీ స్టైఫండ్, అందరికీ ఆరోగ్య బీమా, పెన్షన్, రక్షణ కల్పించడంతో పాటు కోర్టుల్లో మౌలిక సదుపాయాలు, మహిళా న్యాయవాదులకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా



ఖాద్రి, బల్లా ప్రభాకర్, కె. చిరంజీవి, చంద్ర మౌళి, శ్రవణ్ కుమార్, ఎన్. కార్తీక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు మానవతా విలువల్లోనూ ముందంజ

- **చిన్నారి చికిత్సకు ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆర్థిక సహాయం**



ఉద్యమ కెరటం, సత్తుపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న తోట లహరి ప్రియ అనే చిన్నారికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిమిత్తం స్థానిక టాలెంట్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి రూ.25వేల ఆర్థిక సహాయం అందించారు. ఆపదలో ఉన్న చిన్నారికి అండగా నిలిచి తమ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నారి లహరి ప్రియ త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆపదలో ఉన్న వారికి సహాయం అందించడం మానవత్వానికి నిదర్శనమని, విద్యార్థుల్లో సేవాభావం, సానుభూతి, సామాజిక బాధ్యతను పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. విద్యార్థులు సైతం ముందుకొచ్చి ఆపదలో ఉన్న చిన్నారికి ఆర్థిక సహాయం అందించడం ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. చిన్న వయసులోనే సేవా గుణాన్ని అలవర్చుకొని, తోటి వారికి అండగా నిలుస్తున్న విద్యార్థులు దేశానికే గర్వకారణమని కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు కూడా ముందుకొచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షణీయమని అన్నారు. చిన్నారికి ఆపద సమయంలో అండగా నిలవడం అభినందనీయమని, విద్యార్థుల్లో మానవత్వం, సేవాభావం పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. చిన్నారి లహరి ప్రియ త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ఆనందంగా జీవితాన్ని కొనసాగించాలని టాలెంట్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆకాంక్షించారు.

బెల్ట్ షాపు అక్రమ వసూళ్లు

- **ఆరుగురు వీడీసీ సభ్యులు సహా ఏడుగురి అరెస్ట్**



ఉద్యమ కెరటం, గుడిహత్నూర్: బెల్ట్ షాపు నిర్వహణకు అనుమతి పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేసిన ఆరుగురు వీడీసీ సభ్యులతో పాటు అక్రమ మద్యం విక్రయిస్తున్న మరో వ్యక్తిని గుడిహత్నూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని మన్నూర్ (సాయినగర్) గ్రామానికి చెందిన సోలంకి మహేష్ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఈనెల 15న పోలీసులు పట్టుకుని 10 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో భాగంగా బెల్ట్ షాపు నడుపుకోవడానికి గ్రామాభివృద్ధి పేరుతో ఆరుగురు వీడీసీ సభ్యులు తెలంగే జ్ఞానేశ్వర్, పూరి గజానంద్, బాబు ముండే, రాథోడ్ ఏకనాథ్, కడం దిగంబర్, తెలంగ్ నారాయణ తనను బెదిరించి రూ.15వేలు వసూలు చేసినట్లు మహేష్ తెలిపాడు. దీంతో మొత్తం ఏడుగురిని అరెస్ట్ చేసి, ఆరుగురు వీడీసీ సభ్యులను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఎల్.శ్రీకాంత్ వివరించారు.

బాధితురాలి ఇంటికెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఉద్యమ కెరటం, సిరికొండ: ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందిన ఫకీర్నాయక్ తండాకు చెందిన ఆడే జనాబాయికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.45వేల ఆర్థిక సహాయం చెక్కును బుధవారం కాంగ్రెస్ నాయకులు ఆమె ఇంటికి వెళ్లి అందజేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు సిరికొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంచం లక్ష్మణ్ ముదిరాజ్, స్థానిక సర్పంచ్ రాథోడ్ మీరాబాయి బిక్కుసింగ్, మాజీ జెడ్పీటీసీ కుంరం రఘురామ్ బాధితురాలి చెక్కును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్య సమస్యలు, ప్రమాదాల సమయంలో వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. బాధితురాలికి ఆర్థిక సహాయం మంజూరు చేయించడంలో చొరవ చూపిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపూర్(బి) సర్పంచ్ కుంరం దీపక్, మార్కెట్ డైరెక్టర్ చవాన్ ప్రకాష్, మండల సెక్రటరీ బారిక్ రావు, నాయకులు గణేష్, విజయ్, రవి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



రెండేళ్లలో పట్టణంలోని ప్రతి కాలనీకి సీసీ రోడ్లు, డ్రైనేజీలు

- అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- జర్మన్ భాష శిక్షణ పొందిన యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు
- రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద



ఉద్యమ కెరటం, మంచిర్యాల: మందమర్రి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రానున్న రెండేళ్లలో ప్రతి కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. బుధవారం మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.1.93 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వివిధ సీసీ రోడ్ల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 3వ వార్డులో ఖబ్రస్తాన్ వరకు రూ.76 లక్షలతో అప్రోచ్ సీసీ రోడ్డు, 19వ వార్డులో రూ.59 లక్షలతో అంతర్గత సీసీ రోడ్డు, 2వ, 22వ వార్డుల్లో రూ.52లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. 23వ వార్డులోని లక్ష్మీ భవానీ కాలనీలో రూ.58 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించడమే తమ లక్ష్యమని, పట్టణంలోని అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. రెండేళ్లలో ప్రతి కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మందమర్రి ప్రాంతం ఏజెన్సీ పరిధిలో ఉండటం, ప్రభుత్వ భూముల కొరత కారణంగా పేదలకు ఇళ్ల కేటాయింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి సింగరేణి సంస్థతో చర్చించి సుమారు ఏడు ఎకరాల భూమిని గుర్తించామని, అక్కడ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల సౌకర్యం కల్పిస్తామని స్పష్టం చేశారు. మందమర్రిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి రూ.3 కోట్లతో రోడ్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించామని, లబ్ధిదారులను పారదర్శకంగా లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి ఇళ్లను కేటాయించామని వివరించారు. పేదలకు సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం టామ్‌కామ్ ఆధ్వర్యంలో మందమర్రిలో నిర్వహిస్తున్న జర్మన్ భాష శిక్షణ కేంద్రాన్ని మంత్రి సందర్శించారు. శిక్షణ పొందుతున్న యువతీ యువకులతో మాట్లాడి వారి ప్రగతిని తెలుసుకున్నారు. బీ-1 స్థాయి శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు బీ-2 స్థాయిని కూడా విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జర్మన్ భాషలో ప్రావీణ్యం సాధించి అవసరమైన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండేళ్లకు పైగా పని అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యతనిస్తూ ప్లేస్‌మెంట్ ప్రక్రియ చేపడతామని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మందమర్రి పట్టణ అభివృద్ధికి మంత్రి ప్రత్యేక చొరవతో అదనంగా రూ.15 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తిచేసి త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అమృత్ పథకం కింద తాగునీటి పైప్‌లైన్ పనులు తుది దశకు చేరుకున్నాయని, ముల్కల్ల నుంచి గోదావరి నీటిని మందమర్రికి తీసుకువచ్చే పైప్‌లైన్ పనులు పూర్తయితే పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తీరుతుందని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, గృహ వసతి, రేషన్ కార్డులు, పెన్షన్లకు సంబంధించిన సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



టిఎస్సిపిఎస్ఇయు నేరడిగొండ మండల అధ్యక్షుడిగా పందిరి కిష్టన్న





ఉద్యమ కెరటం, నేరడిగొండ: తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల సంఘం నేరడిగొండ మండల నూతన కార్యవర్గ నియామకాలను చేపట్టింది. మండల అధ్యక్షుడిగా పందిరి కిష్టన్న, ప్రధాన కార్యదర్శిగా తాళ్ల నర్సయ్యలను నియమించినట్లు సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కాంబ్లే విజయ్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం ఓపీఎస్ పునరుద్ధరణ సాధన కోసం సంఘం చేపట్టే ఉద్యమాలు, కార్యక్రమాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఇందిరమ్మ జీవిత బీమాతో పేదలకు ఆర్థిక భద్రత



ఉద్యమ కెరటం, మద్దూర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యమని కొడ్చిరా గ్రామ సర్పంచ్ బొజ్జడ్కర్ తేజశ్రీ అన్నారు. మద్దూర్ మండలంలోని కొడ్చిరా గ్రామంలో బుధవారం ఇందిరమ్మ జీవిత బీమా పథకం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటుందని, అలాంటి పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఈ బీమా పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. సాధారణ కుటుంబాలకు సైతం జీవిత బీమా సౌకర్యం అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన కుటుంబంలోని సంపాదించే ఒక వ్యక్తికి బీమా నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. బీమా పొందిన వ్యక్తి మరణించిన సందర్భంలో నామినీకి రూ.5లక్షల బీమా పరిహారం అందుతుందని తెలిపారు. బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిలు, మద్దూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిలు, హన్మంత్ యాదవ్, వార్డు సభ్యుడు మొగ్లయ్య, కాంగ్రెస్ నాయకుడు కొండా గంగాధర్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అటవీ అనుమతుల సమస్యలను పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: జిల్లాలోని ఏజెన్సీ, అటవీ ప్రాంతాల్లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వాటికి సంబంధించిన అటవీ శాఖ అనుమతులపై జిల్లా కలెక్టర్ రాజర్షిషా బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా పీవీటీజీ కోర్ ప్రాంతాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని, రిజర్వ్ ఫారెస్ట్ (ఆర్ఎఫ్) పరిధిలో ఉన్న ఇళ్లకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేద గిరిజన లబ్ధిదారులకు గృహ నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆర్ఓఎఫ్ఆర్ పట్టా భూముల్లో లబ్ధిదారుల ఆధ్వర్యంలో చేపడుతున్న పాత చేదబావుల పూడికతీత, కొత్త చేదబావుల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఏజెన్సీ గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సంఘాల భవనాల నిర్మాణాలకు సంబంధించి ఎదురవుతున్న అటవీ శాఖ అనుమతుల సమస్యలపై అధికారులతో చర్చించారు. గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, హౌసింగ్, విద్యుత్ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న క్లియరెన్స్‌లను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, పెండింగ్ అనుమతులను త్వరితగతిన పొందాలని, అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీఓ మంద మకరంద్, అటవీ శాఖ అధికారి సుశాంత్ సుఖదేవ్ బొబాడే, హౌసింగ్ పీడీ శంకర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో మైనారిటీ గురుకుల విద్యార్థుల సత్తా

- పది పతకాల కైవసం.. ముగ్గురికి రాష్ట్రస్థాయి పోటీలకు అవకాశం



ఉద్యమ కెరటం, కామారెడ్డి: జిల్లా స్థాయిలో బుధవారం నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో కామారెడ్డి మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారు. వివిధ క్రీడా విభాగాల్లో ప్రతిభ చాటి మొత్తం పది బంగారు, రజత పతకాలను సాధించి సత్తా చాటారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు ప్రణీత, వైష్ణవి, మధుమిత రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో విజయం సాధించడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జి.ప్రణీత విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు శిక్షణ అందించిన పీఈటీ, పీడీలను ప్రశంసించారు. క్రీడల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ కనబర్చి మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలకు ఏర్పాట్లు

ఉద్యమ కెరటం, అక్బర్‌పేట భూంపల్లి: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభ, ఆత్మవిశ్వాసాన్ని వెలికితీసే లక్ష్యంతో లిటిల్ ఫ్లవర్ పాఠశాల ఆధ్వర్యంలో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం వెల్లడించింది. డిసెంబర్ 11న పాఠశాల ఆవరణలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ పోటీలను రెండు విభాగాలుగా నిర్వహించనున్నట్లు పేర్కొంది. మొదటి విభాగమైన సాంప్రదాయ వేషధారణలో భారతీయ సాంప్రదాయ దుస్తులు, వివిధ రాష్ట్రాల సంస్కృతి, సాంప్రదాయాలు, పండుగలను ప్రతిబింబించేలా విద్యార్థులు వేషధారణతో పాల్గొనవచ్చని తెలిపింది. రెండో విభాగమైన పాశ్చాత్య వేషధారణలో ఆధునిక, ఆకర్షణీయమైన సృజనాత్మక దుస్తులతో తమ ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశం కల్పించనున్నట్లు వివరించింది. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు 'మిస్ లిటిల్ ఫ్లవర్–2026', 'మాస్టర్ లిటిల్ ఫ్లవర్–2026' బిరుదులను అందజేయనున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో చిన్నారుల్లో మాట్లాడే నైపుణ్యం, వేదికపై ప్రదర్శన ఇచ్చే సామర్థ్యం, ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. తల్లిదండ్రులు తమ పిల్లలను పోటీలకు సిద్ధం చేసి, పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరింది.



నూతన రైస్ మిల్లును ప్రారంభించిన బక్కి వెంకటయ్య



ఉద్యమ కెరటం, దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గంలోని ఖాజీపూర్ గ్రామంలో సుధాకర్ రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన రైస్ మిల్లును రాష్ట్ర మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు కావడంతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. స్థానికంగా వరి ధాన్యం ప్రాసెసింగ్ సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. యువత, వ్యాపారవేత్తలు గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని సూచించారు. తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆకాంక్షించారు. అనంతరం రైస్ మిల్లు నిర్వాహకుడు సుధాకర్ రెడ్డిని అభినందించి, నూతన వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి చిరంజీవి, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంవిధాన్ రక్షా మార్చ్‌ను విజయవంతం చేద్దాం

ఉద్యమ కెరటం, జవహర్‌నగర్: రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంవిధాన్ రక్షా మార్చ్‌ను విజయవంతం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ కోఆర్డినేటర్ గజ్జెల కాంతం పిలుపునిచ్చారు. చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సంవిధాన్ రక్షా కార్యక్రమంలో భాగంగా నవంబర్ 26న హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. లిబర్టీ సర్కిల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందని వివరించారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. అదే విధంగా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ గొడుగు వేణు, బింగి సతీష్ గౌడ్, రజిత గోపాల్, కారింగుల రాజు గౌడ్, చిట్టి బాబు, ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్, జోగి సునీత, మాధవ రెడ్డి, నర్సింగరావు ముదిరాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు రాహుల్ కదం, రేసు లక్ష్మీ, నర్ర మహేష్, సాయి కృష్ణ (మిట్టు), రామిరెడ్డి, టోపీ స్వామి, కాలేశా, బబ్లూ ముదిరాజ్, బూడిద శ్రీనివాస్, భాస్కర్ గౌడ్, ఇరగడిండ్ల రాజు, మహేష్, నాగరాజుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





స్టోక్స్‌కు పచ్చజెండా.. బ్రూక్‌పై నిషేధం!

ఐపీఎల్ 2027 వేలానికి బెన్ స్టోక్స్ అర్హుడు

ప్రాథమిక జాబితాలో 1,220 మంది ఆటగాళ్లు

డిసెంబర్ 4న తుది జాబితా విడుదల

ముంబై, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): ఐపీఎల్ 2027 వేలంలో పాల్గొనేందుకు ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్‌కు మార్గం సుగమమైంది. అయితే అదే దేశానికి చెందిన స్టార్ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌పై నిషేధం కొనసాగుతోంది. మెగా వేలానికి దూరంగా ఉన్న విదేశీ ఆటగాళ్లకు, వేలంలో జట్లు కొనుగోలు చేసిన అనంతరం వైదొలిగే ఆటగాళ్లకు బీసీసీఐ వేర్వేరు నిబంధనలు అమలు చేస్తుండటమే ఇందుకు కారణం. బీసీసీఐ నిబంధనల ప్రకారం మెగా వేలంలో పేరు నమోదు చేసుకోని విదేశీ ఆటగాడు ఆ తర్వాతి ఏడాది జరిగే వేలంలో పాల్గొనేందుకు అనర్హుడు. పనిభారం, ఇంగ్లాండ్ జట్టు ప్రాధాన్యాల నేపథ్యంలో స్టోక్స్ 2025 మెగా వేలంలో పేరు నమోదు చేసుకోలేదు. దీంతో 2026 మినీ వేలానికి దూరమయ్యాడు. ఈ ఆంక్ష తదుపరి ఒక్క వేలానికి మాత్రమే పరిమితం కావడంతో 2027 వేలంలో పాల్గొనేందుకు స్టోక్స్‌కు అర్హత లభించింది. మరోవైపు 2025 మెగా వేలంలో హ్యారీ బ్రూక్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ రూ.6.25 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే సీజన్ ప్రారంభానికి ముందే అతడు వైదొలిగాడు. వేలంలో కొనుగోలు చేసిన అనంతరం టోర్నీ నుంచి తప్పుకొనే ఆటగాళ్లపై రెండు సీజన్ల నిషేధం విధించే నిబంధన బ్రూక్‌కు వర్తించింది. దీంతో అతడిపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. చివరి నిమిషంలో విదేశీ ఆటగాళ్లు తప్పుకోవడం వల్ల జట్ల ప్రణాళికలు దెబ్బతింటున్న నేపథ్యంలో ఫ్రాంచైజీల విజ్ఞప్తి మేరకు బీసీసీఐ ఈ నిబంధనలను తీసుకొచ్చింది. ఇదిలా ఉండగా, లక్నో సూపర్ జెయింట్స్ విడుదల చేసిన శ్రీలంక ఆల్‌రౌండర్ వనిందు హసరంగ రూ.2 కోట్ల కనీస ధరతో తిరిగి వేలం బరిలోకి దిగనున్నాడు. ఐపీఎల్ 2027 వేలానికి సంబంధించి మొత్తం 1,220 మంది ఆటగాళ్లతో ప్రాథమిక జాబితా సిద్ధం కాగా, డిసెంబర్ 4న తుది జాబితాను విడుదల చేయనున్నారు.

న్యూజిలాండ్‌పై అదరగొట్టిన బుమ్రా

టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారీ జంప్..

దుబాయ్, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): ఐసీసీ తాజా టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా మూడు స్థానాలు ఎగబాకి ఉమ్మడి రెండో స్థానానికి చేరుకున్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఐదు వికెట్లు తీసిన బుమ్రా, ఇంగ్లాండ్ బౌలర్ ఓలీ రాబిన్‌సన్‌తో కలిసి రెండో స్థానంలో నిలిచాడు. అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్‌కు, బుమ్రాకు మధ్య కేవలం 25 రేటింగ్ పాయింట్ల తేడా మాత్రమే ఉండటంతో నంబర్ వన్ ర్యాంక్‌కు పోటీ రసవత్తరంగా మారింది. దక్షిణాఫ్రికా బౌలర్ కగిసో రబాడా రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఆరో స్థానానికి చేరగా, పాకిస్థాన్ బౌలర్ మొహమ్మద్ అబ్బాస్ 12వ స్థానానికి ఎగబాకాడు. మరోవైపు, ఐసీసీ టెస్ట్ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్-10లో ముగ్గురు భారత బ్యాటర్లు చోటు దక్కించుకున్నారు. న్యూజిలాండ్‌పై 128 పరుగులు చేసిన రిషబ్ పంత్ ఒక స్థానం ఎగబాకి 6వ స్థానానికి, 98 పరుగులు చేసిన శుభ్‌మన్ గిల్ మూడు స్థానాలు మెరుగుపరుచుకుని 7వ స్థానానికి చేరుకున్నారు. యశస్వి జైస్వాల్ ఐదు స్థానాలు ఎగబాకి 9వ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. టెస్ట్ బ్యాటింగ్‌లో ఇంగ్లాండ్ ఆటగాళ్లు హ్యారీ బ్రూక్, జో రూట్ తొలి రెండు స్థానాల్లో కొనసాగుతుండగా, దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా 3వ స్థానానికి చేరాడు. భారత ఆటగాళ్లలో కేఎల్ రాహుల్ 25వ స్థానానికి, దేవదత్ పడిక్కల్ 15 స్థానాలు ఎగబాకి 39వ స్థానానికి చేరుకున్నారు. న్యూజిలాండ్ ఆటగాళ్లు గ్లెన్ ఫిలిప్స్ 17వ స్థానంలో, హెన్రీ నికోల్స్ 30వ స్థానంలో నిలిచారు. బంగ్లాదేశ్‌కు చెందిన తౌహిద్ హృదయ్ 28 స్థానాలు ఎగబాకి 33వ స్థానానికి, లిటన్ దాస్ 24వ స్థానానికి చేరారు. పరిమిత ఓవర్ల క్రికెట్ ర్యాంకింగ్స్‌లోనూ ఇంగ్లాండ్ ఆటగాళ్లు సత్తా చాటారు. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించిన బెన్ డకెట్ వన్డే బ్యాటింగ్‌లో 4వ స్థానానికి, విల్ జాక్స్ 47వ స్థానానికి ఎగబాకారు. వన్డే బౌలింగ్‌లో గస్ అట్కిన్సన్ 23వ, లియామ్ డాసన్ 39వ ర్యాంక్‌కు చేరుకున్నారు. టీ20 బౌలింగ్‌లో ఆదిల్ రషీద్ 2వ స్థానానికి, బ్యాటింగ్‌లో ఫిల్ సాల్ట్ 6వ స్థానానికి, టామ్ బాంటన్ 26 స్థానాలు ఎగబాకి 34వ స్థానానికి చేరుకోగా, బౌలింగ్‌లో సామ్ కరన్ ఉమ్మడి 45వ స్థానంలో నిలిచాడు.



విధులకు డుమ్మా.. విందులో అధికారులు!

- సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీతో బట్టబయలైన నిర్లక్ష్యం..
- బాధ్యులపై చర్యలు ఎప్పుడు..?



ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్: ప్రజలకు సేవలందించాల్సిన ప్రభుత్వ అధికారులు విధులకు దూరంగా ఉంటే సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించేది ఎవరు.. కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చోటుచేసుకున్న పరిణామాలు పట్టణంలో చర్చనీయాంశంగా మారాయి. మున్సిపల్ కమిషనర్ బదిలీ సందర్భంగా సిర్పూర్ అటవీ ప్రాంతంలోని భీమన్న గుడి వద్ద ఏర్పాటు చేసిన వీడ్కోలు విందు నేపథ్యంలో కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ప్రజలు తమ పనుల నిమిత్తం మున్సిపల్ కార్యాలయానికి వచ్చి అధికారుల కోసం ఎదురుచూస్తుంటే, మరోవైపు అధికారులు విందు కార్యక్రమంలో పాల్గొన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలకు సేవలు అందించాల్సిన సమయంలో ప్రభుత్వ సిబ్బంది కార్యాలయాల్లో అందుబాటులో లేకపోవడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీతో కలకలం..!

మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో లేరన్న సమాచారం నేపథ్యంలో సబ్ కలెక్టర్ హర్ష చౌదరి ఆకస్మికంగా కార్యాలయాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో సిబ్బంది కనిపించకపోవడం, ఖాళీగా ఉన్న కుర్చీలు విధి నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తాయి. సబ్ కలెక్టర్ తనిఖీతో ఈ వ్యవహారం మున్సిపల్ వర్గాల్లో చర్చకు దారితీసింది. ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించే జీతాలు ప్రజలు కట్టే పన్నుల నుంచే వస్తాయి. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడం అధికారుల ప్రాథమిక బాధ్యత. బదిలీ వేడుకలు, వీడ్కోలు కార్యక్రమాలు నిర్వహించుకోవడంలో అభ్యంతరం లేకపోయినా, వాటి కారణంగా ప్రభుత్వ విధులకు ఆటంకం కలగడం మాత్రం ఆమోదయోగ్యం కాదని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటారా..?

సాధారణ ఉద్యోగి విధులకు ఆలస్యంగా వస్తే వివరణ కోరే అధికారులు, కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో లేని ఈ వ్యవహారంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. విధులకు అనుమతి లేకుండా గైర్హాజరైనట్లు తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ కార్యాలయాలే నిర్లక్ష్యానికి వేదికలుగా మారితే పరిపాలనపై ప్రజలకు నమ్మకం ఎలా నిలుస్తుంది.. సబ్ కలెక్టర్ పరిశీలనతో వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులెవరో తేల్చాలి. కేవలం వివరణలతో సరిపెట్టకుండా, నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణైతే చర్యలు తీసుకుంటారా.. లేక ఈ వ్యవహారం కూడా కాలగర్భంలో కలిసిపోతుందా.. అన్నది ఇప్పుడు కాగజ్‌నగర్ పట్టణ ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

జీ మీడియా "దక్కన్ ఐకాన్స్" అవార్డు అందుకున్న విరాహత్ అలీ





ఉద్యమ కెరటం, హైదరాబాద్: హైదరాబాద్ దక్కన్ పరిధిలో వివిధ రంగాల్లో పేరు ప్రఖ్యాతలు పొందుతున్న 12మంది ప్రముఖులకు జీ జాతీయ మీడియా సంస్థ అందించిన "దక్కన్ ఐకాన్స్-2026" పురస్కారాన్ని దశాబ్దాల తరబడి సామాజిక, మీడియా రంగాల్లో సేవలందిస్తున్న సీనియర్ పాత్రికేయులు, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అందుకున్నారు. బుధవారం నాడు బంజారాహిల్స్ లోని రెడిసన్ బ్లూ హోటల్ లో జీ మీడియా సంస్థ నిర్వహించిన సభలో, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రాష్ట్ర సాగునీటి మరియు పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిల చేతుల మీదుగా విరాహత్ అలీ ఈ పురస్కారాన్ని పొందారు. ఇంకా ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ గురుకుల విద్యాసంస్థల చైర్మన్ ఫహీం ఖురేషి, తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా ఖాన్, జీ సలాం టీవీ ఎడిటర్ తారిఖ్ ఫరీదీ, జీ తెలుగు ఛానెల్ ఎడిటర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

మహికా వేలికి ఉంగరం

- హార్దిక్ నిశ్చితార్థం జరిగిందా?
- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా పూజా కార్యక్రమం ఫొటోలు
- 'చివరికి ఆమె నాదైంది' అంటూ పెట్టినట్లు ప్రచారం
- నిశ్చితార్థం జరిగిందంటూ అభిమానుల ఊహాగానాలు
- అధికారికంగా స్పందించని హార్దిక్, మహికా

ముంబై, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): భారత స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా మరోసారి తన వ్యక్తిగత జీవితంతో వార్తల్లో నిలిచాడు. తన ప్రేయసి, మోడల్, నటి మహికా శర్మతో నిశ్చితార్థం చేసుకున్నాడంటూ సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇటీవల వీరిద్దరూ కలిసి ఇంట్లో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఫొటోలు వైరల్‌గా మారాయి. అందులో మహికా వేలికి పెద్ద ఉంగరం కనిపించడంతో నిశ్చితార్థం జరిగిందంటూ అభిమానులు ఊహాగానాలు చేస్తున్నారు. ఈ ప్రచారానికి హార్దిక్‌కు చెందినదిగా చెబుతున్న ఓ ఇన్‌స్టాగ్రామ్ పోస్టు మరింత ఆజ్యం పోసింది. 'చివరికి ఆమె నాదైంది' అంటూ హార్దిక్ రాసినట్లు ప్రచారం జరుగుతోంది. తమ బంధంలో మరో అడుగు ముందుకు వేసినట్లు సంకేతమిచ్చేందుకే ఈ పోస్టు పెట్టాడని అభిమానులు భావిస్తున్నారు. అయితే ఆ పోస్టు ప్రామాణికతతోపాటు నిశ్చితార్థం వార్తలపైనా ఇప్పటివరకు అధికారిక స్పష్టత లేదు. హార్దిక్, మహికా శర్మ 2025 అక్టోబర్‌లో తమ ప్రేమ బంధాన్ని బహిరంగపరిచారు. అప్పటి నుంచి పలు సందర్భాల్లో కలిసి కనిపిస్తున్నారు. మోడల్‌గా, నటిగా, యోగా శిక్షకురాలిగా మహికా గుర్తింపు సంపాదించుకున్నారు. పలు ఫ్యాషన్ ప్రదర్శనలు, సినిమాలు, వాణిజ్య సంస్థల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హార్దిక్ గతంలో సెర్బియా నటి నటాషా స్టాంకోవిచ్‌ను 2020లో వివాహం చేసుకున్నాడు. వీరికి అగస్త్య అనే కుమారుడు ఉన్నాడు. 2024 జూలైలో పరస్పర అంగీకారంతో విడిపోతున్నట్లు ప్రకటించిన వీరిద్దరూ కుమారుడి బాధ్యతలను కలిసి చూసుకుంటున్నారు. తాజాగా మహికా వేలికి కనిపించిన ఉంగరంతో హార్దిక్ రెండో వివాహంపై చర్చ మొదలైంది. నిశ్చితార్థం జరిగిందా? లేదా? అన్నది వారిద్దరూ స్పందిస్తేనే స్పష్టత రానుంది.





మంచి పాత్ర ఇస్తామని మోసం చేశారు!

‘ఆదర్శ కుటుంబం’ చిత్రబృందంపై పూజిత పొన్నాడ సంచలన ఆరోపణలు

హైదరాబాద్, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘ఆదర్శ కుటుంబం’ చిత్రంపై నటి పూజిత పొన్నాడ సంచలన ఆరోపణలు చేశారు. సినిమాలో ప్రాధాన్యమున్న పాత్ర ఇస్తామని చెప్పి చివరకు ఒక్క సన్నివేశానికే పరిమితం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా ఓ ముఖాముఖిలో చిత్రీకరణ సమయంలో తనకు ఎదురైన చేదు అనుభవాలను వెల్లడించారు. చిత్రబృందం తన నమ్మకాన్ని వమ్ము చేసిందని ఆరోపించారు. దర్శకుడు త్రివిక్రమ్ స్వయంగా తనకు రూప పరీక్షలు నిర్వహించి పాత్రకు ఎంపిక చేశారని పూజిత తెలిపారు. కథ ప్రారంభం నుంచి ముగింపు వరకు తన పాత్ర ఉంటుందని, నారా రోహిత్‌తో కలిసి కీలక సన్నివేశాలతోపాటు కొన్ని పోరాట సన్నివేశాల్లోనూ నటించాల్సి ఉంటుందని చెప్పారన్నారు. ఆ హామీలను నమ్మే ఒప్పందంపై సంతకం చేసి ముందస్తు పారితోషికం తీసుకున్నట్లు వెల్లడించారు. కొన్ని రోజులపాటు చిత్రీకరణలో పాల్గొన్న అనంతరం దాదాపు మూడు నెలలపాటు చిత్రబృందం నుంచి ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు. తన పాత్ర నిడివి తగ్గించబోమని భరోసా ఇచ్చినప్పటికీ, తనకు తెలియకుండానే మరో సీనియర్ నటితో ఆ పాత్రను భర్తీ చేసినట్లు తెలిసిందన్నారు. సినిమా విడుదలైన తర్వాత చూస్తే తాను నటించిన ఒక్క సన్నివేశం మాత్రమే కనిపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి చిత్రీకరించేందుకు సమయం లేకపోవడంతోనే ఆ సన్నివేశాన్ని ఉంచినట్లు తనకు తెలిసిందన్నారు. చివరకు చిత్రంలో నటీనటుల పేర్ల జాబితాలోనూ తన పేరును చేర్చలేదని పూజిత ఆరోపించారు. ప్రాధాన్యమున్న పాత్ర ఇస్తామని హామీ ఇచ్చి ఒక్క సన్నివేశానికే పరిమితం చేయడం నమ్మకద్రోహం కాదా? దీనికి బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రశ్నించారు. ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

నాకూ పెళ్లి చేసుకోవాలని ఉంది!

మనసులోని మాట బయటపెట్టిన నిత్యా మేనన్

హైదరాబాద్, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): తనకు కూడా పెళ్లి చేసుకోవాలనే ఆలోచన ఉందని ప్రముఖ కథానాయిక నిత్యా మేనన్ వెల్లడించారు. పెళ్లి పట్ల తనకు ఆసక్తి లేదంటూ జరుగుతున్న ప్రచారానికి తాజాగా ఓ ముఖాముఖిలో స్పష్టతనిచ్చారు. గతంలో వివాహం గురించి తాను చేసిన వ్యాఖ్యలను చాలామంది తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపారు. పెళ్లికి తానెప్పుడూ వ్యతిరేకం కాదని, అయితే జీవితంలోకి ఎలాంటి వ్యక్తి రావాలి, ఆ బంధం ఎలా ఉండాలనే విషయంలో తనకు పూర్తి స్పష్టత ఉందని పేర్కొన్నారు. కేవలం పెళ్లి చేసుకోవడం కోసం కాకుండా సరైన వ్యక్తితో అందమైన బంధాన్ని ఏర్పరచుకోవాలన్నదే తన ఆకాంక్ష అని చెప్పారు. తన వ్యక్తిగత స్వభావం గురించి కూడా నిత్యా ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. చిన్నప్పటి నుంచే నలుగురిలో కనిపించడానికి సిగ్గుపడేదాన్నని, ఎవరైనా తనవైపు తదేకంగా చూస్తుంటే అక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పేదాన్నని నవ్వుతూ గుర్తుచేసుకున్నారు. ప్రజల మధ్య ఉన్నప్పుడు కొంత అసౌకర్యంగా అనిపిస్తుందని, అయితే అలాంటి సందర్భాల్లో తనను తాను ప్రశ్నించుకుంటూ కొత్త విషయాలను నేర్చుకుంటానని వివరించారు. ప్రస్తుతం బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్‌తో కలిసి ‘మిస్టర్ అండ్ మిసెస్ గ్రే’ అనే హిందీ చిత్రంలో నిత్యా మేనన్ నటిస్తున్నారు. వివాహంపై ఆమె చేసిన తాజా వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.





‘భోగి’ ప్రచారానికి అనుపమ దూరం

రెండు ప్రచార వేడుకలకూ హాజరుకాని కథానాయిక

ప్రచార కార్యక్రమాల్లో డింపుల్ హయాతి సందడి

కథలో మార్పులే అనుపమ అసంతృప్తికి కారణమా?

హైదరాబాద్, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): శర్వానంద్ కథానాయకుడిగా సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం ‘భోగి’. కె.కె. రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రం పలుమార్లు వాయిదాపడి ఎట్టకేలకు నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ సమీపిస్తుండటంతో చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. అయితే ఆదివారం నిర్వహించిన విడుదలకు ముందస్తు వేడుకతోపాటు మంగళవారం జరిగిన సంగీత విభావరికీ ప్రధాన కథానాయిక అనుపమ పరమేశ్వరన్ హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు డింపుల్ హయాతి ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. తొలుత డింపుల్ హయాతిని సహాయ పాత్ర కోసం ఎంపిక చేసినప్పటికీ, అనంతరం కథలో మార్పులు చేయడంతో ఆమె పాత్రకు ప్రాధాన్యం పెరిగిందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే అనుపమ అసంతృప్తికి గురయ్యారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. తొలుత తనకు చెప్పిన కథలో భారీ మార్పులు చేయడంతోనే ఆమె ప్రచార కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని, చిత్రానికి సంబంధించిన ప్రచార చిత్రాలు, పాటలను సైతం తన సామాజిక మాధ్యమాల ఖాతాల్లో పంచుకోవడం లేదని ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఎలాంటి అధికారిక నిర్ధారణ లేదు. విడుదలకు ముందు నిర్వహించే తదుపరి ప్రచార కార్యక్రమాల్లోనైనా అనుపమ పాల్గొంటారా? అన్నది అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆమె గైర్హాజరుకు అసలు కారణమేమిటన్నది అనుపమ లేదా చిత్రబృందం స్పందిస్తేనే స్పష్టత రానుంది.

ఉత్కంఠ రేపుతున్న ‘దాలింబ్’!

తప్పిపోయిన చిన్నారి చుట్టూ మిస్టరీ.. ■ భిన్నమైన పాత్రలో జితేంద్ర కుమార్

పోలీస్ అధికారినిగా ప్రియా బాపట్.. ■ డిసెంబర్ 4 నుంచి జీ5లో ప్రసారం

ముంబై, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): ‘పంచాయత్’ వెబ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న నటుడు జితేంద్ర కుమార్, మరాఠీ నటి ప్రియా బాపట్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన సైకలాజికల్ థ్రిల్లర్ ‘దాలింబ్’. డిసెంబర్ 4 నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక జీ5లో ఈ చిత్రం నేరుగా ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం విడుదల చేసిన ప్రచార చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముంబై శివారు ప్రాంతాల నేపథ్యంలో రెండు మిస్టరీల చుట్టూ ఈ కథ సాగుతుంది. ఓ వైపు తప్పిపోయిన చిన్నారి ఆచూకీ కోసం అన్వేషణ, మరోవైపు మానసిక చికిత్సాలయం నుంచి తప్పించుకున్న వ్యక్తి చుట్టూ చోటుచేసుకునే పరిణామాలను ఉత్కంఠభరితంగా చూపించారు. జానపద కళాకారుడు సూరజ్‌గా, తన బిడ్డ కోసం తల్లడిల్లే తండ్రిగా జితేంద్ర కుమార్ కనిపించనున్నారు. ఇప్పటివరకు హాస్య, భావోద్వేగభరిత పాత్రలతో అలరించిన ఆయన ఈ చిత్రంలో పూర్తిగా భిన్నమైన పాత్రను పోషించారు. చిన్నారి అదృశ్యం కేసును దర్యాప్తు చేసే పోలీస్ అధికారినిగా ప్రియా బాపట్ నటించారు. ప్రియా అవెన్ కథ, దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని ఎల్లిప్సిస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై తనుజ్ గార్గ్, అతుల్ కస్బేకర్ నిర్మించారు. మానసిక సంఘర్షణలు, అనూహ్య పరిణామాలతో సాగిన ప్రచార చిత్రం సినిమాపై అంచనాలను పెంచుతోంది.



సాయిపల్లవిలో సరికొత్త కోణం!

క్లాస్ నుంచి మాస్ పాత్రల వైపు అడుగులు

‘ఓం’లో పోలీస్ అధికారినిగా అదరగొట్టిన నటి

వాణిజ్య చిత్రాలపై దృష్టి సారిస్తున్నట్లు ప్రచారం

హైదరాబాద్, నవంబర్ 25 (ఉద్యమ కెరటం): సహజ నటన, అద్భుతమైన నృత్యంతో దక్షిణాది చిత్ర పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయిక సాయిపల్లవి. తెలుగు, మలయాళం, తమిళం, హిందీ భాషల్లో విశేష అభిమానులను సొంతం చేసుకున్న ఈ భామ ఇప్పటివరకు భావోద్వేగభరితమైన పాత్రలతో యువతను, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తాజాగా తనలోని మరో కోణాన్ని ఆవిష్కరిస్తూ పోరాట సన్నివేశాల్లోనూ సత్తా చాటుతున్నారు. ధనుష్ కథానాయకుడిగా నటించిన ‘ఓం’ చిత్రంలో ఏఎస్పీ నిత్యారెడ్డి పాత్రలో సాయిపల్లవి తనదైన నటనతో ఆకట్టుకున్నారు. శక్తిమంతమైన పోలీస్ అధికారినిగా, పోరాట సన్నివేశాల్లో ఆమె ప్రదర్శన ప్రేక్షకులను మెప్పించింది. మహిళా ప్రధాన కథాంశాలతో ఇప్పటికే మంచి గుర్తింపు తెచ్చుకున్న సాయిపల్లవి ఇకపై వాణిజ్యపరమైన చిత్రాలపైనా దృష్టి సారించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. రణ్‌బీర్ కపూర్‌తో కలిసి నటించిన ‘రామాయణ’ చిత్రం కూడా సాయిపల్లవి స్థాయిని మరింత పెంచింది. ఈ ఏడాది ‘రామాయణ’, ‘ఓం’ చిత్రాలతో తన నటనలోని భిన్న కోణాలను పరిచయం చేసిన ఆమె భవిష్యత్తులో మహిళా ప్రధాన వాణిజ్య చిత్రాల్లో నటించే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే తన తదుపరి చిత్రాల ఎంపికపై సాయిపల్లవి నుంచి అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ రుణాలు అందించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి





ఉద్యమ కెరటం, ఖమ్మం: జిల్లాలో ప్రభుత్వ పథకాల ద్వారా అర్హులైన ప్రతిఒక్కరికీ రుణాలు అందేలా బ్యాంకర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో నిర్వహించిన డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశంలో వివిధ ప్రభుత్వ పథకాల కింద రుణాల మంజూరు, పంపిణీ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పంట రుణాల పంపిణీ లక్ష్యం రూ.5,266 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.2,035 కోట్లు మాత్రమే పంపిణీ చేశారని, లక్ష్యాన్ని వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పంట రుణాల రెన్యూవల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి బ్యాంకుల వారీగా సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. పీఎం విశ్వకర్మ పథకం కింద పెండింగ్‌లో ఉన్న 515 దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి వెంటనే రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాల పంపిణీని పెంచడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న రుణాలను విడుదల చేయాలని సూచిం చారు. సంఘాల రుణ బకాయిల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ఎన్‌పీఏలను తగ్గించాలని పేర్కొన్నారు. పీఎం స్వనిధి పథకం ద్వారా అర్హులైన వీధి వ్యాపారులకు నిబంధనల ప్రకారం తదుపరి విడత రుణాలు అందించాలని ఆదేశిం చారు. వీధి వ్యాపారులు అధిక వడ్డీలకు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు తీసుకోకుండా బ్యాంకులు అవ సరమైన సహకారం అందించాలని సూచించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలు మంజూరు చేయాలని, తయారీ, వ్యాపార రంగాల అభివృద్ధికి బ్యాంకులు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, స్వయం ఉపాధి పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎ.రవి ప్రసాద్, ఆర్బీఐ లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ యశ్వంత్ సాయి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పురందర, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఫిరంగి, వివిధ బ్యాంకుల ప్రాంతీయ మేనేజర్లు, నోడల్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అజ్మతుల్లా హుస్సేనీకి మైనారిటీ నాయకుల సత్కారం



ఉద్యమ కెరటం, గంభీరావుపేట: తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీకి కర్ణాటక రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించడంతో గంభీరావుపేట మండల కాంగ్రెస్ మైనారిటీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షుడు మహమ్మద్ యాసీన్ హుస్సేన్ ఆధ్వర్యంలో మైనారిటీ నాయకులు హైదరాబాద్‌లోని అజ్మతుల్లా హుస్సేనీ నివాసానికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఆయన అందించిన సేవలు, రాజకీయ అనుభవం, పార్టీ పట్ల అంకితభావాన్ని గుర్తించి అధిష్ఠానం కీలక బాధ్యతలు అప్పగించడం అభినందనీయమన్నారు. కర్ణాటక రాష్ట్రంలో పార్టీ సంస్థాగత బలోపేతానికి, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆయన కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నియామకం తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు సయ్యద్ షఫీ, రావుఫ్, కలీం, సయ్యద్ సజ్జాద్, సయ్యద్ అసద్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లాలో 424 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఉద్యమ కెరటం, సిద్దిపేట: ఖరీఫ్ 2026–27 సీజన్‌కు సంబంధించి సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 424 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ కిరణ్ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ఎఫ్‌ఏక్యూ ప్రమాణాల ప్రకారం మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏడు రకాల సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున అదనపు బోనస్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామని, సరిపడా గన్నీ సంచులు, ధాన్యం రవాణాకు లారీలను అందుబాటులో ఉంచామని వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే సమయంలో దిగుమతిలో జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా తమ సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు సిద్దిపేటలో జాబ్ మేళా

జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రియాంక

ఉద్యమ కెరటం, సిద్దిపేట: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 27న సిద్దిపేట పట్టణంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రియాంక తెలిపారు. కోటిలింగాల వద్ద ఉన్న సెట్విన్ ట్రైనింగ్ సెంటర్‌లో జాబ్ మేళాతో పాటు టామ్‌కామ్ అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో ఐదు ప్రముఖ ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఉద్యోగ ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్ మేళా కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో నిర్ణీత సమయంలో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రజక సోదరుల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం



ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ ధోబీ కాలనీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నూతన ధోబీఘాట్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. అంజని పుత్ర కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ ఆధునిక యాంత్రీకృత ధోబీఘాట్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రజక సోదరుల వృత్తిపరమైన కష్టాలను తగ్గించి, వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకే ఈ ఆధునిక ధోబీఘాట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆధునిక యంత్రాలతో కూడిన ఈ ధోబీఘాట్ సేవలను రజక కులస్థులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయిచరణ్ గౌడ్, షాలిని యోగేష్, కళల శ్రీనివాస్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు, అంజని పుత్ర కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు, రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 1న పార్లమెంట్ ముట్టడిని జయప్రదం చేయాలి



ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ డిసెంబర్ 1న నిర్వహించనున్న చలో ఢిల్లీ పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ ముట్టడి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక లందరికీ పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్, గ్రాట్యుటీ వంటి చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలన్నారు. కనీస వేతనాన్ని రూ.42వేలకు, కనీస పెన్షన్‌ను రూ.21వేలకు పెంచాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలను నిలిపివేయాలని, స్కీమ్ వర్కర్ల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్మికులు, రైతులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని, పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షులు బండి దత్తాత్రి, సీఐటీయూ కోశాధికారి కె.సునిత, సహాయ కార్యదర్శి రేసు సురేందర్, నాయకులు శేఖర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం అభివృద్ధి కోసం సింగరేణి జీఎంకు వినతి



ఉద్యమ కెరటం, తాండూర్: మాదారం గ్రామపంచాయతీ పరిధిలోని క్రీడా ప్రాంగణాన్ని చదును చేసి పోలీస్, ఆర్మీ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న గ్రామీణ యువతకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని బెల్లంపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రమేష్‌కు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా యువతకు శారీరక శిక్షణ, పరుగు పందెం తదితర సాధనలకు అనువుగా క్రీడా ప్రాంగణాన్ని పూర్తిస్థాయిలో చదును చేయించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జీఎం రమేష్ రెండు రోజుల్లో గ్రేడర్ సహాయంతో మైదానాన్ని చదును చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సమస్యపై వెంటనే స్పందించి క్రీడా ప్రాంగణం అభివృద్ధికి చర్యలు తీసుకున్న జీఎం రమేష్‌కు గ్రామ ప్రజలు, యువత, క్రీడాకారుల తరపున సూరం రవీందర్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్, ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ సర్పంచ్ పర్పత్ రావు, ఉప సర్పంచ్ ప్రభాకర్ రావు, కాంగ్రెస్ నాయకులు మీనుగు కృష్ణ, భగవంతురావు తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

మండల వ్యవసాయ అధికారి సుష్మా



ఉద్యమ కెరటం, తాండూర్: వరి పంట కోత అనంతరం పొలాల్లో మిగిలిన పంట అవశేషాలను కాల్చవద్దని, యాసంగి సీజన్‌లో వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి సుష్మా రైతులకు సూచించారు. మండలంలోని ద్వారకపూర్ గ్రామపంచాయతీలో బుధవారం సర్పంచ్ మసాడి తిరుపతి అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. వరి కోత అనంతరం పొలాల్లో మిగిలే కొయ్యలు, ఇతర పంట అవశేషాలను తగులబెట్టడంతో భూమిలోని సూక్ష్మజీవులు నశించడంతో పాటు భూసారం తగ్గిపోతుందని వివరించారు. పంట అవశేషాలను కాల్చడం ద్వారా వాయు కాలుష్యం పెరిగి పర్యావరణానికి నష్టం కలుగుతుందని తెలిపారు. వాటిని కాల్చకుండా భూమిలో కలియదున్నడం ద్వారా సేంద్రియ ఎరువుగా మారి భూసారం పెరుగుతుందని, తదుపరి పంటలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు పర్యావరణ పరిరక్షణతో పాటు భూమి ఆరోగ్యాన్ని కాపాడే విధంగా వ్యవసాయ పద్ధతులను పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం



ఉద్యమ కెరటం, తాండూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని బుధవారం గ్రామ సర్పంచ్ ఆకుల వెంకటేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఆర్థిక భరోసాగా నిలుస్తుందని తెలిపారు. ఈ పథకంలో నమోదు చేసుకునేందుకు 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులైన వారు తమ రేషన్ కార్డు, ఆధార్ కార్డులతో హాజరుకావాలని సూచించారు. నమోదు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ప్రజలు సంబంధిత సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్యామల, గ్రామ కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు కటకల మల్లేష్, వార్డు సభ్యుడు జంబోజుల ప్రవీణ్, ఐకేపీ పీఓలు రామగిరి తిరుపతి, కంప్యూటర్ ఆపరేటర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం





ఉద్యమ కెరటం, జైనూర్: మండలంలోని జంగం గ్రామం కుక్కగూడ ప్రాంతంలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా వంగిపోయి కనిపిస్తోంది. విద్యుత్ తీగల ఆధారంగానే స్తంభం నిలబడి ఉండటంతో ఎప్పుడు కూలిపోతుందోనని స్థానిక రైతులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా కాలంగా ఈ స్తంభం ఇదే పరిస్థితిలో ఉన్నప్పటికీ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. బలమైన గాలులు, వర్షాలు వచ్చినప్పుడు స్తంభం కూలిపోయి ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇదే ప్రాంతంలో మరికొన్ని విద్యుత్ స్తంభాలు సైతం వంగిపోయి ఉన్నాయని తెలిపారు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే సరిచేసి, కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షణ రక్షిత: UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

అంతరించిపోతున్న ఓజా సాంప్రదాయ లోహ కళ

- పూర్వీకుల వృత్తిని కాపాడుకునేందుకు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు
- ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందుల్లో జంగం, ఉషేగాం గిరిజన కళాకారుల కుటుంబాలు







ఉద్యమ కెరటం, జైనూర్: తరతరాలుగా పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న అరుదైన ఓజా సాంప్రదాయ లోహ కళ కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ కళను కొనసాగిస్తున్న కళాకారుల కుటుంబాలు సరైన ఆదాయం లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహం, మార్కెటింగ్ సౌకర్యాలు, ముడిసరుకులపై రాయితీలు లేకపోవడంతో ఈ వృత్తిపై ఆధారపడిన కుటుంబాలు అందోళన చెందుతున్నాయి. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మండలం జంగం, ఉషేగాం గ్రామాలతో పాటు కెరమెరి మండలం కేస్లగూడ గ్రామాల్లో గోండు గిరిజన కుటుంబాలు సాంప్రదాయ ఓజా లోహ కళను కొనసాగిస్తున్నాయి. పూర్వీకుల నుంచి నేర్చుకున్న నైపుణ్యంతో వివిధ రకాల లోహ వస్తువులను చేతితో తయారు చేస్తూ ఈ అరుదైన కళను సజీవంగా ఉంచుతున్నారు.

అద్భుతమైన కళాకృతుల తయారీ..

ఓజా కళాకారులు ఇత్తడి తదితర లోహాలతో దీపస్తంభాలు, దీపాలు, గిన్నెలు, పాత్రలు, గంటలు, ఏనుగులు, నెమళ్లు, గుర్రాల బొమ్మలు, జంతువుల ఆకృతులు, గృహాలంకరణ వస్తువులు వంటి అనేక కళాకృతులను తయారు చేస్తున్నారు. ప్రతి వస్తువును ఎంతో నైపుణ్యంతో చేతితో రూపొందించడం ఈ కళ ప్రత్యేకత. వస్తువులపై అందమైన డిజైన్లు, సున్నితమైన ఆకృతులను చెక్కుతూ తమ కళా ప్రతిభను చాటుతున్నారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలతో ఈ కళకు విడదీయలేని అనుబంధం ఉంది. ముఖ్యంగా నాగోబా జాతరతో ఓజా కళకు ప్రత్యేక సంబంధం ఉంది.

రోజుల తరబడి శ్రమ.. గిట్టుబాటు కాని ఆదాయం

ఒక సాధారణ వస్తువును తయారు చేయడానికి నాలుగు నుంచి ఐదు రోజుల సమయం పడుతుండగా, ప్రత్యేక డిజైన్లతో కూడిన వస్తువుల తయారీకి రెండు నుంచి మూడు వారాల వరకు సమయం పడుతుంది. ఇంత కష్టపడి తయారు చేసిన కళాకృతులకు సరైన ధర లభించకపోవడంతో కళాకారులు నిరాశ చెందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తుండగా, పట్టణ ప్రాంతాల్లో అదే వస్తువులకు అధిక ధర లభిస్తోందని కళాకారులు చెబుతున్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా వినియోగదారులకు తమ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

ముడిసరుకుల ధరల పెరుగుదలతో కష్టాలు..

ఓజా కళ తయారీకి అవసరమైన ఇత్తడి వంటి ముడిసరుకుల ధరలు పెరుగుతుండటంతో తయారీ ఖర్చులు భారంగా మారుతున్నాయి. గతంలో రూ.500 ఉన్న ముడిసరుకు ధర మూడు నెలల్లో రూ.900కు పెరిగిందని కళాకారుడు ఆత్రం దిలీప్ ఆవేదన వ్యక్తం చేశారు. ముడిసరుకుల ధరలు పెరగడం, తయారీకి ఎక్కువ సమయం పట్టడం, ఆర్డర్లు తగ్గిపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని తెలిపారు.

ప్రభుత్వ యూనిట్ ఉన్నా.. ఆర్డర్ల కోసం ఎదురుచూపులు

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కళాకారుల కోసం ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేసినప్పటికీ, తయారుచేసిన వస్తువులకు మార్కెట్లో తగిన డిమాండ్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కళాకారులు చెబుతున్నారు. ఆర్డర్లు వచ్చినప్పుడు మాత్రమే పనులు చేపడుతున్నామని పేర్కొంటున్నారు. ఈ సాంప్రదాయ కళను భవిష్యత్ తరాలకు అందించేందుకు యువతకు శిక్షణ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. యువ కళాకారులు తమ తల్లిదండ్రులకు సహకరిస్తూ ఈ సాంప్రదాయ వృత్తిలో నైపుణ్యం సంపాదిస్తున్నారు. అయితే ఈ వృత్తి ద్వారా నిరంతర ఆదాయం లభించక పోవడంతో పూర్తిస్థాయిలో దీనిపైనే ఆధార పడలేని పరిస్థితి నెలకొంది. ఆర్డర్లు వచ్చినప్పుడే ఆదాయం వస్తుండటంతో ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను అన్వేషించాల్సి వస్తోందని యువ కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓజా కళకు పూర్వవైభవం తీసుకురావాలి..

తరతరాలుగా కొనసాగుతున్న ఓజా సంప్రదాయ లోహ కళను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కళాకారులు కోరుతున్నారు. ముడిసరుకుల కొనుగోలుకు సబ్సిడీలు అందించాలని, కళాకారులకు ఆర్థిక సహాయం చేయాలని, తయారైన వస్తువుల విక్రయానికి ప్రత్యేక మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నాగోబా జాతరతో పాటు ఇతర గిరిజన ఉత్సవాల్లో ఓజా కళాకృతుల ప్రదర్శన, విక్రయాల కోసం ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కళాకారులకు తగిన గుర్తింపు, యువతకు శిక్షణ, నిరంతర ఉపాధి కల్పిస్తే ఈ అరుదైన కళను భవిష్యత్ తరాలకు అందించవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన కళను కాపాడుకుంటూ జీవనం సాగిస్తున్న ఓజా కళాకారుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని, అంతరించిపోతున్న ఈ సంప్రదాయ కళకు పూర్వవైభవం తీసుకురావాలని గిరిజనులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుడు లేక ఖాళీగా పాఠశాల

- విద్యకు దూరమవుతున్న కొలాం విద్యార్థులు

ఉద్యమ కెరటం, జైనూర్: పాఠశాలలో ఉపాధ్యాయుడు లేకపోవడంతో కొలాం విద్యార్థుల చదువులు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. జైనూర్ మండలం పానాపటార్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు గేడాం విజయ్ కుమార్‌ను మాన్కుగూడ గ్రామానికి స్థానచలనం చేయడంతో పానాపటార్ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ఉపాధ్యాయుడి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంపై గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన పాఠశాలలో ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సిడాం భీంరావ్ మాట్లాడుతూ గ్రామీణ, ఆదివాసీ పిల్లలకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఉపాధ్యాయుడిని ఎందుకు స్థానచలనం చేశారో సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే పాఠశాలకు మరో ఉపాధ్యాయుడిని నియమించి విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా చూడాలని కోరారు. గ్రామ పటేల్ భీంరావ్, ఆత్రం లక్ష్మణ్ రావు, ఆత్రం బాలు, రాందాస్, బాలాజీ, భీంరావ్ అభినాథ్ తదితర గ్రామస్థులు మాట్లాడుతూ తమ



పిల్లలు విద్యకు దూరం కాకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పానాపటార్ పాఠశాలలో వెంటనే ఉపాధ్యాయుడిని నియమించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరుతున్నారు.

లాడ్జీల మేనేజర్లను బెదిరించి నగదు దోపిడీ

- ఆపరేషన్ కవచ్‌లో ఐదుగురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యుల అరెస్ట్
- కారు, 25 రిజిస్టర్లు, నకిలీ బంగారు బిస్కెట్లు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం
- జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర





ఉద్యమ కెరటం, కామారెడ్డి: లాడ్జీల మేనేజర్లను బెదిరించి రిజిస్టర్లు, నగదు అపహరిస్తూ, రిజిస్టర్లలోని వ్యక్తిగత వివరాలను ఉపయోగించి బంగారం పేరుతో మోసాలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర తెలిపారు. ఆపరేషన్ కవచ్‌లో భాగంగా చేపట్టిన తనిఖీల్లో నిందితులను పట్టుకుని వారి వద్ద నుంచి క్రెటా కారు, 25 లాడ్జి రిజిస్టర్లు, నకిలీ బంగారు బిస్కెట్లు, ఐదు మొబైల్ ఫోన్లు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 21, 22 తేదీల్లో అర్ధరాత్రి కామారెడ్డి పట్టణంలోని అక్షయ గ్రాండ్ లాడ్జికి ఐదుగురు వ్యక్తులు వచ్చి గది కావాలని అడుగుతూ విధుల్లో ఉన్న మేనేజర్‌ను బెదిరించి లాడ్జికి సంబంధించిన రిజిస్టర్లతో పాటు రూ.10వేల నగదును అపహరించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందడంతో కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కామారెడ్డి డీఎస్పీ ఎస్.మధుసూదన్ పర్యవేక్షణలో టౌన్ ఎస్‌హెచ్‌ఓ నరహరి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలు సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో నిందితుల కోసం గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి పట్టణ ప్రవేశ ప్రాంతంలోని ఆపరేషన్ కవచ్ తనిఖీ కేంద్రం వద్ద అనుమానాస్పదంగా కనిపించిన క్రెటా కారును పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అందులోని వ్యక్తుల సమాధానాలు పొంతన లేకపోవడంతో విచారించగా అక్షయ గ్రాండ్ లాడ్జిలో జరిగిన దోపిడీతో పాటు ఇతర ప్రాంతాల్లో చేసిన నేరాలు వెలుగులోకి వచ్చాయి. కర్ణాటక రాష్ట్రంలోని హోస్పేట్ ప్రాంతానికి చెందిన మాచిహళ్లి మారుతి, చక్రి పరశురామ్, అభిషేక్ కవ్వాడి, వెంకటేష్ సట్పాడి, సంతోష్ సట్పాడి కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వివిధ ప్రాంతాల్లోని లాడ్జీలు, హోటళ్లకు వెళ్లి మేనేజర్లను బెదిరించి అక్కడ బస చేసిన వ్యక్తుల పేర్లు, చిరునామాలు, ఫోన్ నంబర్లతో కూడిన రిజిస్టర్లను బలవంతంగా అపహరించేవారు. అనంతరం రిజిస్టర్లలోని ఫోన్ నంబర్లకు కాల్ చేసి, బాధితుల గత బస వివరాలు, ఇతర వ్యక్తిగత సమాచారాన్ని చెబుతూ పరిచయస్తులమనే నమ్మకం కలిగించేవారు. తర్వాత కర్ణాటకలో తక్కువ ధరకు బంగారం లభిస్తుందని చెప్పి మొదట అసలైన బంగారాన్ని నమూనాగా చూపించి, కిలోల కొద్దీ బంగారం కొనుగోలు చేయవచ్చని నమ్మించి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడేవారు. ఈ ముఠా జోగుళాంబ గద్వాల, జడ్చర్ల, షాద్‌నగర్, కొత్తూరు, హైదరాబాద్ చందానగర్, సంగారెడ్డి, మెదక్ జిల్లా నర్సాపూర్ తదితర ప్రాంతాల్లోని పలు లాడ్జీల మేనేజర్లను బెదిరించి రిజిస్టర్లను అపహరించినట్లు విచారణలో వెల్లడైంది. కామారెడ్డి అక్షయ గ్రాండ్ లాడ్జిలో మేనేజర్ అడ్డుకునేందుకు ప్రయత్నించగా స్ట్రాంగ్‌వైర్ చూపించి, కారుతో తొక్కించి చంపుతామని బెదిరించి పరారయ్యారు. దోచుకున్న నగదును ఐదుగురు సమానంగా పంచుకున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.8,500 నగదు, క్రెటా కారు, 25 లాడ్జి రిజిస్టర్లు, వివిధ బరువుల నకిలీ బంగారు బిస్కెట్లు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆపరేషన్ కవచ్‌లో చాకచక్యంగా వ్యవహరించి ముఠా సభ్యులను పట్టుకున్న ఏఆర్ఎస్సై భాను, రాహుల్, శుండాల సింగ్, కానిస్టేబుల్ పీర్య, హోంగార్డు మల్లేష్‌లను ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.

మాదారంలో ఉపాధిహామీ నూతన పనులు ప్రారంభం



ఉద్యమ కెరటం, తాండూర్: మండలంలోని మాదారం గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం ఉపాధిహామీ పథకం కింద నూతన పనులను డీసీసీ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి ఎంపీడీఓ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిజి రామ్ జీ పథకం ద్వారా ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి 125 రోజుల పని కల్పించడమే లక్ష్యమని తెలిపారు. గ్రామాల్లోని జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలు నిర్ణీత సమయానికి చేరుకొని, తమకు కేటాయించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు గోదల లక్ష్మి, మీసా లలిత, కత్తెర్ల రవికుమార్, ఏపీఓ సత్యనారాయణ, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీవాణి, ఉపాధిహామీ సిబ్బంది రమేష్, ప్రసాద్, మేట్ పుష్ప, ఉపాధిహామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రకు బయల్దేరిన యూనుస్ పటేల్‌కు సన్మానం



ఉద్యమ కెరటం, డొంగ్లీ: కామారెడ్డి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు, ఎంభూరా గ్రామ సర్పంచ్ యూనుస్ పటేల్ తన కుటుంబ సభ్యులతో కలిసి పవిత్ర ఉమ్రా యాత్రకు బయల్దేరుతున్న సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, సన్నిహితులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం అధ్యక్షుడు అజీమ్ లాలా యూనుస్ పటేల్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర ఉమ్రా యాత్ర ప్రతి ముస్లిం జీవితంలో ఎంతో ప్రత్యేకమైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుందని అన్నారు. యూనుస్ పటేల్ కుటుంబ సభ్యులతో కలిసి చేపడుతున్న యాత్ర అల్లాహ్ ఆశీస్సులతో సుఖసంతోషాలతో సాగాలని, పవిత్ర మక్కా, మదీనాలో ప్రార్థనలు నిర్వహించి క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. డీసీసీ ఉపాధ్యక్షుడిగా, గ్రామ సర్పంచ్‌గా ప్రజలకు సేవలందిస్తూ రాజకీయ, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న యూనుస్ పటేల్‌కు పలువురు నాయకులు, గ్రామ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.

అంగన్వాడీ నియామకాలపై 23 అభ్యంతరాలు స్వీకరణ

ఉద్యమ కెరటం, సిరిసిల్ల: జిల్లాలో అంగన్వాడీ నియామక ప్రక్రియకు సంబంధించి మొత్తం 23 అభ్యంతరాలు స్వీకరించినట్లు జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజం తెలిపారు. అభ్యర్థుల నివాస అర్హత, కుల ధ్రువీకరణ పత్రాలు, మార్కుల శాతం, మార్కుల వెయిటేజీ, దివ్యాంగుల వెయిటేజీ, స్థానిక నివాస అర్హత, విద్యార్హతలు తదితర అంశాలపై అభ్యంతరాలు వచ్చినట్లు పేర్కొన్నారు. స్వీకరించిన 23 అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే చందుర్తి ప్రాంతంలో రోస్టర్‌కు సంబంధించిన అంశం, కొత్తపల్లి-2లో ఎంపికైన అభ్యర్థి మార్కుల శాతంలో సాంకేతిక తప్పిదం గుర్తించినట్లు వివరించారు. మిగతా అభ్యంతరాలపై పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. అభ్యంతరాల పరిశీలన ప్రక్రియ పూర్తయిన అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. అంగన్వాడీ నియామకాల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, అభ్యర్థులు ఎలాంటి అపోహలకు గురికావద్దని సూచించారు. నియామకాలు ఇప్పిస్తామని చెప్పే దళారుల మాటలు నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని కోరారు.

జీవిత బీమాతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా



ఉద్యమ కెరటం, మద్నూర్: మండలంలోని పెద్ద తడ్గూర్ గ్రామంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని గ్రామ సర్పంచ్ శాంతాబాయి ఇరన్న బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకం ఎంతో ఉపయోగకరమని అన్నారు. అనుకోని ప్రమాదాలు, కుటుంబ పెద్ద మరణం వంటి సందర్భాల్లో బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాల్లో 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు గల సంపాదించే వ్యక్తికి రూ.5లక్షల జీవిత బీమా సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. బీమా పొందిన వ్యక్తి మరణిస్తే నామినీకి రూ.5 లక్షల బీమా పరిహారం అందుతుందని వివరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరస్వర్ సాయిలు మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబం ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిలు, ఎంపీఓ సత్యనారాయణ రెడ్డి, గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు సుభాష్, కొండా గంగాధర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.